PAKOHA 269

శ్రీమతి ఇందిరాగాంధి
ప్రధానమంత్రి

ఆంధ్రప్రదేశ్ రజతోత్సవం

అభివృద్ధి శిఖరాల అంచుల్లోకి

శ్రీ టి. అంజయ్య
ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్

ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మార్గదర్శకత్వంలో శ్రీ టి. అంజయ్య చైతన్య పూరితమైన నాయకత్వంలో అభ్యుదయకాముక ఆంధ్రప్రదేశ్ సత్వరాభివృద్ధి సాధిస్తూ ముందడుగు వేస్తోంది. ఈ రజతోత్సవ సంవత్సరంలో సృజనాత్మకమైన పథకాలు, నూతన కార్యక్రమాల అమలు ఫలితంగా మన రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించింది. ఆర్థిక పురోభివృద్ధిలోను, ప్రజల సంక్షేమ రంగంలోను మన రాష్ట్రం అమోఘమైన రీతిలో పురోగమించింది.

శ్రీమతి ఇందిరాగాంధీ 20 సూత్రాల కార్యక్రమంతోపాటు, 5 సూత్రాల కార్యక్రమాన్ని కూడా పటిష్టంగా అమలు జరపడంతో మన రాష్ట్రం ప్రగతికి బాటలు వేస్తోంది.

రైతులకు ప్రోత్సాహకాల పంట:

- 10 ఎకరాల మెట్ట లేదా 5 ఎకరాల మాగాణి కన్నా తక్కువ భూమిగల కమతం దార్లకు భూమిశిస్తు ఉండదు.
- పంటల భీమా పథకం ప్రవేశ పెట్టారు.

వెలుగు జిలుగులు:

- స్థాపిత విద్యుదుత్పాదక శక్తి రికార్డు స్థాయిలో 2,298 మెగావాట్లకు చేరుకుంది.

పేదలకు గృహాలు - సమాజ సంక్షేమం:

- 1980-81 సంవత్సరంలో 1,50,478 కుటుంబాలకు ఇళ్ళ స్థలాలు సమకూర్చారు. ఇందుకోసం, 7,238 ఎకరాల ప్రైవేటు భూములు సేకరించడంతోపాటు 2,161 ఎకరాల ప్రభుత్వ భూములు వినియోగించారు.
- ప్రస్తుత సంవత్సరంలో షెడ్యూలు కులాల అభ్యున్నతికి వీలుగా ప్రత్యేక అంశాల కార్యక్రమానికి రూ. 52 కోట్లు కేటాయించారు. 1979-80లో కేవలం రు. 5.25 మాత్రమే వినియోగించారు.
- వికలాంగులకు నెలకు రూ. 30/-ల చొప్పున నిరుద్యోగ భృతి కల్పిస్తారు.

పరిశ్రమల ప్రగతి కార్మికులకు ప్రోత్సాహం:

- 1981 జూలైలోని సింగరేణి బొగ్గు గనులలో రికార్డు స్థాయిలో 1,00,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించారు.
- ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తుల అభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు.

మారుమూల ప్రాంతాలకు సేద్యపు నీటి సౌకర్యం:

- పోలవరం ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగింది.
- శ్రీశైలం కుడికాలువ నిర్మాణం చేపట్టారు.
- జూరాల ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభమైంది.

రామరాజ్య పథంలో... గ్రామస్వరాజ్:

- దశాబ్దానికి పైగా తర్వాత గ్రామ పంచాయితీలు, సమితులకు ప్రత్యక్ష ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు.
- ప్రప్రథమంగా 18 సంవత్సరాల వయస్సుగల వారికి ఓటు హక్కు ఇవ్వబడింది.

సహకార సంఘాలు:

- 1980-81 సంవత్సరంలో రికార్డు స్థాయిలో రు. 90.90 కోట్ల మేరకు స్వల్పకాలిక, మధ్యకాలిక రుణాలను మంజూరు చేశారు.
- కేంద్ర సహకార వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు రికార్డు స్థాయిలో రు. 68 కోట్ల మేరకు దీర్ఘకాలిక రుణాలను మంజూరు చేసింది.

రేపటి పౌరులకు ఉత్తమ విద్య:

- కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారు.
- సమగ్ర విద్యా బిల్లు ఆమోదించారు.

సమర్థత పెంపుదలకు సర్వీసుల క్రమపద్ధతి:

- పౌర పంపిణీ పద్ధతిని క్రమబద్ధ చేయడానికి అత్యవసర సరుకుల సరఫరా కార్పొరేషను ఏర్పాటు చేశారు.
- 1980-81లో రాష్ట్రం ఆదాయం రూ. 5,975.08 కోట్ల నుంచి రూ. 6,915.51 కోట్లకు 15.7 శాతం పెరిగింది.
- మునిసిపల్ ప్రాంతాలన్నిటిలో గుడిసెల అగ్నిప్రమాద భీమా పథకాన్ని ప్రవేశ పెట్టారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమాచార, పౌరసంబంధ శాఖా డైరెక్టర్ చే ప్రకటితము:
చారి నెం. 50.

తీయనిరుచుల తారాలోకం

న్యూట్రిన్

సూపర్ స్టార్

SuperStar

పలురకాల టాఫీలు



nutrine

ఒక్కొక్క మిఠాయి యందు ఫలరస పూరిత విందు!

న్యూట్రిన్ కన్ఫెక్షనరీ కంపెనీ లిమిటెడ్, చిత్తూరు-517 002 (ఆం.ప్ర.)

CAS/NC.53/81 TEL

PAKOHA 269


విజయబాపినీడు నిర్వహణలో
శ్యాంప్రసాద్ ఆర్ట్ ప్రొడక్షన్స్
డబ్బు! డబ్బు! డబ్బు!
ఈస్ట్‌మన్ కలర్
దర్శకత్వం:
జి. రామమోహనరావు
నిర్మాత
మాగంటి రవీంద్రనాథ్ చౌదరి

3

"సాంప్రదాయ సిద్ధమయిన భారతీయ ఔషధాలకి ప్రత్యేకమయిన శక్తివుంది. ఉదాహరణకి, అమృతాంజన్."



ప్రకృతిలో లభించే అత్యంత శక్తి వంతమయిన పది మూల ఔషధాలతో అమృతాంజన్ తయారు చేయబడుతోంది. అంటే అమృతాంజన్ చాలా శక్తి వంతమయినది.

అందుచేత అమృతాంజన్ తలనొప్పులకు, జలుబులకు, వంటినొప్పులకు, బెణుకులకు శీఘ్రంగానూ, నిశ్చయంగానూ ఉపశమనం కలిగిస్తుంది. అంతేకాదు అమృతాంజన్ సురక్షితమయిన బాధా నివారిణి.

అమృతాంజన్ : 80 సంవత్సరాలకు పైబడిన నమ్మకమైన దివ్య ఔషధము.

AM 2148

అమృతాంజన్

తలనొప్పులకు .జలుబులకు.
వంటినొప్పులకు.బెణుకులకు

బొమ్మరిల్లు

సంపాదకుడు: విజయ బాపినీడు

బలంతోపాటు గర్వాన్ని పెంచుకున్న మనుషులు సహజంగా ప్రగల్భాలు పలుకుతారనీ, శారీరక బలం కన్నా బుద్ధిబలం గొప్పదనీ, మహా బలవంతులమని విర్రవీగేవారు తరచూ బలహీనంగా వుండే మేధావుల చేతులలో చిత్తుగా ఓడిపోవటం జరుగుతూ వుంటుం దనీ చక్కగా నిరూపిస్తుంది 'శ్రవణుడి గొప్పతనం' అనే కథ.

ప్రజలకు సేవ చేసే వారికి తమ నిర్ణయాలను అమలు పరిచేందుకు తగినంత అధికారం వుండాలనీ, అది లేనప్పుడు ప్రజలకు వారి మీద తీవ్రమైన అసంతృప్తి బయలుదేరుతుందనీ, ఫలితంగా వారు తమ పదవులను పోగొట్టుకోవటం జరుగుతుందనీ మరో కథలో తెలుసుకుంటాం.

సంపుటి: 11 జనవరి 1982 సంచిక: 5

విడి ప్రతి: 1-75 సంవత్సర చందా: 21-00

5



ఉపబర్హణుడు

గంధర్వలోకంలో ఉపబర్హణుడు అనే గంధర్వుడు ఉండేవాడు. అతడు మిక్కిలి సుందరుడు. మధురమైన కంఠంతో గానం చేసేవాడు. అతడి సౌందర్యానికీ, మధుర గానానికీ ముగ్ధులైన గంధర్వకాంత లనేకులు అతణ్ణి ప్రేమించి, అతడి ప్రేమ పాత్రులైనారు.

ఒకసారి సృష్టికి మూలపురుషులైన బ్రహ్మలు దేవసత్త్రమనే యాగం చేశారు. ఆ యాగానికి యక్ష, కిన్నెర, గంధర్వ, కింపురుషులందరినీ పిలిపించారు. గంధర్వులలో బాగా పాడగలడనే ఖ్యాతి గడించటం వలన ఉపబర్హణుణ్ణి కూడా పిలిపించారు. ఉపబర్హణుడు గంధర్వకాంతలతో కలిసి దేవసత్త్ర యాగానికి వెళ్ళాడు.

అక్కడ ఉపబర్హణుడు విష్ణుమహిమలతో కూడిన అనేక పాటలు పాడి, అక్కడి వారిని అందరినీ తన గానంతో ముగ్ధులను చేశాడు. ఆ తర్వాత తన కీర్తనలను, కర్తవ్యాన్ని మరిచి గంధర్వకాంతలతో కలిసి విలాసంగా కాలం గడపసాగాడు. ఇది తెలిసి బ్రహ్మలు అతడి మీద మండి పడ్డారు.

కర్తవ్యాన్ని విస్మరించిన ఉపబర్హణుణ్ణి బ్రహ్మలు ఇలా శపించారు.

"ఓరీ దురాత్మా! విష్ణు కీర్తనల మరచి మోహాంధకారంతో ప్రవర్తించిన నీవు భూమిపై ఒక బ్రాహ్మణుడి దాసియైన ఒక స్త్రీకి పుట్టెదవు గాక!"

అప్పుడు ఉపబర్హణుడు తన తప్పు తెలుసుకొని, పశ్చాత్తాపంతో కుమిలి పోయాడు. అయినా బ్రహ్మల శాపం తప్పదు కదా! శాపానుసారం ఉపబర్హణుడు భూలోకంలో ఒక బ్రాహ్మణుడి దాసి కడుపున పుట్టాడు.

ఒకసారి ఆ బ్రాహ్మణుడు చాతుర్మాస్య మనే వ్రతం చేయబూనాడు. దాసీపుత్రుడైన ఉపబర్హణుణ్ణి వ్రతానికి వచ్చిన యోగులకు సేవలు చేయ నియమించాడు.

బాలుడైన ఉపబర్హణుడు మిక్కిలి వినయ విధేయతలతో ఆ యోగులను సేవించాడు. వారికి బట్టలు వుతికి, పాదప్రక్షాళన చేసి, విశ్రాంతి సమయాల్లో పాదాలు వొత్తి, భోజనానంతరం వారు తినగా మిగిలిన ఆహారాన్ని తింటూ మిగుల భక్తితో వారిని కొలిచాడు. ఆ బాలుడి సేవలకు తృప్తి జెందిన యోగులు, అతడికి అనేక భక్తి మార్గాలూ, విష్ణు సంకీర్తనా పద్ధతులూ బోధించారు. వ్రత సమాప్తి కాగానే, వారు తీర్థయాత్రలకు వెళ్ళిపోయారు. ఆ బాలుడు మాత్రం వారి చేత వుపదేశించబడిన విష్ణుభక్తి మార్గాన్ని తలుచుకుంటూ, విష్ణుకీర్తనలు పాడుకుంటూ కాలకేపం చేయసాగాడు.

ఉపబర్హణుడి తల్లి పగలంతా యజమాని యింట సేవలు చేసి అలసి పోయినా, కుమారుణ్ణి ఎంతో ప్రేమగా చూచుకుంటుంది. కొడుక్కు కూడా తల్లి అంటే ప్రేమ.

ఒకనాడు ఆ దాసి వేకువనే లేచి పాలు పితుకటానికి వెళ్ళింది. చీకటిగా వుండటంచేత కనుపించక ఒక త్రాచుపామును తొక్కింది. వెంటనే త్రాచుపాము ఆమెను కాటు వేసింది. ఆ కాటుతో ఆమె వెంటనే మరణించింది. తల్లి మరణం కళ్ళార చూచిన ఉపబర్హణుడు ఏమాత్రం చలించక, నిగ్రహంతో తల్లికి అంత్యక్రియలు జరిపాడు. ఇక అక్కడ వుండ లేక, విష్ణువును అన్వేషిస్తూ ఇల్లు వదిలి బయలుదేరాడు.

ఉపబర్హణుడు పల్లెలు పట్టణాలు, అడవులు, పర్వతాలు, నదీనదాలు దాటుతూ

విష్ణువును కీర్తిస్తూ నడిచాడు. ఇలా వుండగా ఒకసారి అతడు గలగల పారే సెలయేటి లోని నీరు త్రాగి అలసట తీర్చుకొని, విశ్రాంతి కోసం ప్రక్కనే వున్న ఒక పెద్ద మర్రిచెట్టు నీడన కూర్చొని విష్ణువును తదేకంగా ధ్యానిస్తూ కళ్ళు మూసుకున్నాడు.

అలా ఎంత కాలం గడిచిందో తెలియదు. ఉపబర్హణుడి మనోనేత్రంలో విష్ణురూపం సాక్షాత్కరించింది. వెంటనే కళ్ళు తెరిచాడు. విష్ణురూపం కనిపించలేదు. ఆ రూపం కోసం అతడు వెతకసాగాడు. అప్పుడు అతడికి యిలా వినిపించింది.

"బాలకా, నీవు నా సాక్షాత్కారం ఈ జన్మలో పొందలేవు. నీలో ఇప్పుడున్న కామ క్రోధాది అరిషడ్వర్గాలను జయించు. నా భక్తిని మదిలో నిలుపుకొని, దేహాన్ని విడిచి పెట్టు. యుగాంతమైన తర్వాత, బ్రహ్మ పునః సృష్టి చేస్తాడు. అప్పుడు నీవు నా భక్తులలో అగ్రగణ్యుడవై జన్మిస్తావు. ఆ జన్మలో నిరంతరం నా నామాన్ని జపిస్తూ, నా సన్నిధిలోనే గడుపగలవు.

ఆ తర్వాత, ఉపబర్హణుడు నిష్ఠగా దైవ ధ్యానంలో గడపసాగాడు. అలా ధ్యాన నిమగ్నుడై అరిషడ్వర్గాన్ని జయించి, శరీరాన్ని కృశింపజేసి, చివరకు తనువు చాలించాడు. అతడి ఆత్మ, సృష్టిని చాలించి గాఢ నిద్రలో మునిగి వున్న బ్రహ్మదేవుడి ప్రాణంలో కలిసి పోయింది.

ఘోర ప్రళయంతో సృష్టి అంతమైంది. ఆ తర్వాత, బ్రహ్మ నిదుర లేచాడు. సృష్టి మళ్ళీ ప్రారంభమైంది. బ్రహ్మ మరీచి మొదలైన మునులను సృష్టిస్తూ విష్ణుభక్తితో ప్రాణం విడిచి, తన ప్రాణంలో ఐక్యమైన ఉపబర్హణుణ్ణి మళ్ళీ సృష్టించాడు.

అతడే నారదుడు అన్న పేరుతో విష్ణుదేవుడు ఇచ్చిన వరం ప్రకారం, నిరంతరం హరినామ స్మరణ చేస్తూ పరమ భాగవతోత్తముడుగా ప్రసిద్ధి పొందాడు.



"ఈ కోటలో భ్రమింప జేసేవి అనేకం వున్నాయని, నీకు తెలిపేందుకు రాజు నన్ను నియమించాడు. ఇంతకు పూర్వం నువ్వు చూచిన సర్పకన్యను నేనే!"

జలకుడికి విషయమంతా అర్థమయినట్టు తల ఆడించి, వెళ్ళి రాజుని కలుసుకున్నాడు.

"ఇప్పుడు చెప్పు. ఈ కోటలో నీవు ఏం ఉద్యోగం చేస్తావు," అని రాజు అడిగితే, జలకుడు, "మీరూ, మహారాణీ మాట్లాడు కోవటం విన్నాను. ఆ మాట్లాడు కున్నది నిజంగా మీరూ, మహారాణీ కాదనీ — మీ బొమ్మలనీ, బొమ్మలకు అరువు కంఠం యిచ్చి మీచేత ఏర్పాటు చేయబడ్డవారు మీలాగా, మహారాణిలాగా మాట్లాడి నన్ను భ్రమింప చేశారనీ నాకు అర్థమయింది. కోటలో యింత చిత్రకల్పన చేయ గలిగిన శిల్పిని మీరు పట్టి తేగలిగారంటే, మీరు ఎంతో గొప్ప వారు! ఇప్పుడు నన్ను తెచ్చారు. నాలాంటి వాడితో ఎలాంటి విచిత్రాలు చేయించుకోవచ్చో, నాకన్నా మీకే ఎక్కువ తెల్సు. కనుక, మీకు తోచిన ఉద్యోగం యివ్వండి," అన్నాడు.

"మొదటిది బొమ్మ అని భ్రమించిన వాడివి, రెండవ చోట బొమ్మే అని ఎలా గ్రహించావు?" అని అడిగాడు రాజు.

"ప్రభూ, నా వృత్తిలోనే నేను ఠీవిని కోరిన వాడిని. కత్తితో తప్ప వలతో చేపలు పట్టనన్న వాడిని. నా ఠీవి నచ్చక పోయి వుంటే, అక్కడే మీరు నన్ను, 'పనికిమాలిన వాడికి యింత ఠీవా?' అని అవమానపరిచి వచ్చేసేవారు. మీకు కూడా ఉత్తమోత్తమమైన ఠీవి, దర్పం వున్నాయి కనుక, నా ఠీవిని క్షమించి కోటకు పిలిచారు. నా కోసం మీరూ, మహారాణీ మీ హెూదా మరిచి, నటనకు దిగరని నాకు తెలుసు. సర్పకన్యను చూచి నే నెప్పుడైతే భ్రమించానని గ్రహించానో, రాణివాసంలో నేను చూచినవి బొమ్మలని అర్థం చేసు కున్నాను," అన్నాడు జలకుడు.

రాజు పక్కనే వున్న మంత్రి, అతణ్ణి అంగరక్షకుడిగా నియమించుకోమన్నా, రాజు అతణ్ణి కోశాధికారిగానే చేశాడు.

హేళన చేస్తే, "రాజసం అనేది వంశంలో లేదు. మన బుద్ధుల్లో ఉంటుంది. రాజుగా వుండి ప్రజలను పీడించుకు తినే వారుంటారు. వాళ్ళు మీలాంటి వాళ్ళు. అలాగాక, అనేక ఒనర్లు కలిపించి, దేశాన్ని సుభిక్షం చేసే రాజు లుంటారు. వాళ్ళకి ఠీవి వుంటుంది. ఆ ఠీవి నాది," అనేవాడు.

"నీళ్ళపై పాములు కూడా తేలియాడుతూ వుంటాయి. వాటిని కూడా నరుకు. ఇంకా గొప్ప వేటగాడివి అనిపించు కుంటావు," అని తోటివారు హేళన చేసేవారు.

"అవి నాకు అపకారులు కావు. నేను వాటిని చంపను," అనేవాడు జలకుడు.

"నువ్వు తినే చేపలను పట్టి తినటమే వాటి పని. ఒక రకంగా అవి నీకు శత్రువులే!" అని ఎవరైనా కవ్విస్తే, "ఆ మాట కొస్తే, బెస్తవాళ్ళంతా చేపలు పడుతున్నారు. పాము తడవకి ఒక చేపనే చంపగలదు. వీళ్ళు వలలతో తడవకి వందల కొలది చేపలను చంపగలుగుతున్నారు. అంటే పాము కంటే వీళ్ళు నాకు వందరెట్లు ఎక్కువ శత్రువులన్న మాట! నేను చంపవలసి వస్తే ముందు ఆ వలలు విసిరే వాళ్ళని చంపాలి," అని సమాధాన మిచ్చేవాడు జలకుడు.

ఇలా వుండగా, జలకుడు కత్తితో చేపలను వేటాడటం ఆ దేశపు రాజు, ఆ దారిన పోతూ చూశాడు. ఆశ్చర్యపడి, జలకుణ్ణి పిలిచి అదేమిటని అడిగాడు రాజు:

"నాకు కావలసినవి నేను తీసుకుంటున్నాను. ఎవరికి ఎంత కావాలో అంతే తీసుకోవటం ద్వారా, అందరికీ ఆహారం వుంటుందని నా అభిప్రాయం. వలలతో పట్టి, తరతరాలకూ సరిపోయేలా యిళ్ళల్లో పోసుకోవటం నాకు నచ్చదు, ప్రభూ," అన్నాడు జలకుడు.

రాజుకి ఎందుకో జలకుడు నచ్చాడు. అతడికి ఏం ఉద్యోగం కావాలో చెప్పమన్నాడు రాజు.

"ప్రభూ, నే నెప్పుడూ కోట చూడలేదు. కోటలో ఎన్ని రకాల వుద్యోగాలు వుంటాయో తెలియదు. అంతేగాక, కోటలో

9A

ఎన్నో విచిత్రాలు వుంటాయంటారు. అవి ఎప్పుడూ చూడలేదు. ఒక్కసారి నాకు కోటనీ, కోటలోని మనుషుల్ని చూచే అవకాశం కలిపిస్తే, నాకు ఏ ఉద్యోగం కావాలో కోరుకుంటాను," అన్నాడు జలకుడు.

రాజుకి ఆ ధోరణి కూడా నచ్చింది. అతన్ని వెళ్ళి కోట అంతా చూచి రమ్మన్నాడు. ఎవరి సహాయం లేకుండా జలకుడు కోటలోకి దారి తీశాడు. ఓ చోట సర్పకన్య కనిపించిందతడికి. అది మనిషో, బొమ్మో అతడికి అర్థం కాలేదు. బాగా పరికించి చూచాక, అది బొమ్మ అని అర్థమయింది. అటువంటి వింతలెన్నో అడుగడుగునా కనిపించాయి. 'నాలుగు గోడల మధ్య యీ విడ్డూరాలన్నీ ఎందుకు?' అనుకుంటూ కోటను చుట్టి రావటంలో రాణి

వాసంలో అడుగు పెట్టాడు జలకుడు. అక్కడ రాజూ, రాణీ అతడి గురించే ఏదో మాట్లాడు కుంటున్నారు.

"అలాంటి వాడు, మన సర్పకన్యను చూచి మనిషి అనుకున్నాడో, బొమ్మ అనుకున్నాడో నాకు తెలుసుకోవాలని వుంది," అంది రాణి నవ్వుతూ.

"ముందు మనిషి అనుకుని వుంటాడు. ఆ తరవాత బొమ్మ అని నిర్ణయానికి వచ్చి వుంటాడు. నిజంగా అది 'మనిషే' అని తెలిస్తే మతిపోయినట్టవుతాడు," అన్నాడు రాజు.

ఆ సంభాషణంతా విన్న జలకుడు ఆశ్చర్యపడి, తిరిగి సర్పకన్య వున్న చోటికి పరుగెత్తాడు. అక్కడ సర్పకన్య లేదు. ఓ స్త్రీ మాత్రం వున్నది. ఆమె యిలా అంది.

కరాళుడింత వరకే కథ చెప్పి, "జలకుడికి, రాజుకి అంగరక్షకుడిగా వుండ తగిన రాజభక్తి, సూక్ష్మబుద్ధీ వున్నాయి. అంతటి వాడికి ఖజానాను అంటి పెట్టుకుని, ఓ చోట పడివుండే కోశాధికారి ఉద్యోగం యివ్వటంలో అర్థం ఏమిటి?" అని ప్రశ్నించాడు.

అందుకు సవిత్ర్యుక మహారాజు యీ రకంగా జవాబు చెప్పాడు.

"అంగరక్షకుడనే వాడు వీరుడూ, స్వామిభక్తి గలవాడూ, సూక్ష్మ గ్రాహీ కావలసిన మాట నిజమే! మంత్రి లాంటి వాడిని సయితం మెప్పించిన జలకుడి శక్తి సామర్థ్యాలలో లోపం ఏమీ లేదు. కొలనులో చేపలు — ఎవరికి ఎన్ని కావాలంటే అన్ని పట్టుకునే స్వాతంత్ర్యం వుంది. అయినా, జలకుడు తనకి కావల్సినన్నే సంపాదించే వాడు. సంపాదించు కోవాలనే ధ్యాసలేని మనిషి జలకుడు. దేశంలో వీరులు దొరకవచ్చుగాని, సంపాదన మీద ధ్యాసలేని వాళ్ళూ, స్వార్థం అంటే ఏమిటో తెలియనివాళ్ళూ అరుదు. అందులో చేపలను పట్టటంలో కూడా తీవి ప్రదర్శించిన మనిషి, ఖజానా డబ్బు కాజేయటమనే నీచానికి తలబడక, కోశాధికారి అనే తీవిలో బ్రతుకుతాడు. రాజుకి అంగరక్షకుడు కన్నా, రాజసంపదకు వుండవలసిన రక్షకుడు ఎప్పుడూ గొప్పవాడై వుండాలి. ఇదంతా ఆలోచించి రాజు జలకుడిని కోశాధికారిని చేశాడు."

సరైన సమాధానం రావటంతో, సవిత్ర్యుకుడి కెదురుగా వున్న యువతిపై కరాళుడి ప్రభావం నశించి, ఆ కన్య సింహంగా మారి అడవి లోకి పరుగు తీసింది.



కరాళ కథలు

జలకుడు

పూర్వం జలకుడనే బెస్తవాడొకడుండే వాడు. మిగతా బెస్తవాళ్ళు వలలతో చేపలు పడితే, జలకుడు మాత్రం కత్తితో చేపలను వేటాడేవాడు.

"చేపల కోసం వల విసరటం నామోషీయా?" అని ఎవరైనా అడిగితే, "నేను వీరుణ్ణి. 'చేపలు పట్టాడు,' అనిపించుకోవటం నాకు అసహ్యం. 'చేపలను వేటాడాడు,' అనిపించుకుంటాను," అనేవాడు జలకుడు.

వల విసరటంవల్ల, నీళ్ళ అడుగున వున్న చేపలు కూడా దొరికేవి మిగతా వాళ్ళందరికీ, ఆ చేపలపై మంచి ఆదాయం వచ్చేది. నీళ్ళపై తేలిన చేపలనే, జలకుడు నరకగలుగుతూ వుండేవాడు. వేటవల్ల, భుక్తి గడపటం తప్ప, ఆదాయమనేది లేకపోయినా పట్టించుకునే వాడు కాదు.

"వేటాడటానికి నీవు ఏమైనా రాజువా?" అని కొందరు జలకుణ్ణి





(గత సంచిక తరువాయి)

మాయావి మహాబలశాలి అయిన రాక్షసుడు. అతడి తమ్ముడే దుందుభి. వాలిచేత తన తమ్ముడు హతుడైనాడని విని మాయావి మండిపడ్డాడు.

వాలికి మాయావికి పూర్వం నుంచి వైరం ఉంది. తార చాలా అందగత్తె. ఆమెను పెండ్లాడాలని మాయావి ఎన్నో ఎత్తులు వేశాడు. కాని, అవి సాగలేదు. తార చాలా తెలివైనది. ఆమె వాలినే వరించింది. అప్పటి నుంచి మాయావి వాలిమీద పగబట్టాడు.

తన తమ్ముణ్ణి వాలి చంపాడని విని రోషం పట్టలేక, వాలిని అంత మొందించాలని, కిష్కింధకు శరవేగంతో పరుగెత్తుకొని వచ్చాడు మాయావి. అప్పటికి అర్ధరాత్రి అయింది.

నగరద్వారం దగ్గర మాయావి పెద్దపెట్టున అరుస్తూ, "వాలీ, లేచి రా! నీ అంతు చూస్తాను," అని కేకలు వేయసాగాడు.

అప్పుడు వాలి సుఖశయ్యలో ఉన్నాడు. తార, వాలి ఆ కేకలు విన్నారు.

"ఇప్పుడు నువ్వు వెళ్ళవద్దు. వాడు రాక్షసుడు. దుందుభికి అన్న. మనకు శత్రువు. రాక్షసులకు రాత్రిళ్ళు బలమెక్కువ. తెల్లవారిన తరవాత వాడి సంగతి చూచుకోవచ్చు," అని తార చెప్పింది.

కాని, వాలి వినిపించుకోలేదు. పూర్వవైరాన్ని మాయావి ఇంకా వదులుకోలేదనీ, అతడింకా తారమీద వ్యామోహంతోనే ఉన్నాడనీ, అటువంటి శత్రువును ఉపేక్షించ కూడదనీ, తక్షణం అతణ్ణి వధించాలనీ నిశ్చయించి వాలి లేచి గంట కొట్టాడు. వెంటనే సుగ్రీవుడు సంభ్రమంతో లేచి వచ్చాడు. ఇద్దరూ గదాయుధాలు ధరించి హుటాహుటిగా కోట గుమ్మం దగ్గరికి వెళ్ళి తలుపులు తెరిచారు.

మాయావి వాలి సుగ్రీవుల నిద్దర్శి

చూచాడు. సుగ్రీవుణ్ణి తేరిపార చూచాడు. కళ్ళు బైర్లు క్రమ్మాయి. ఈ ఇద్దర్నీ జయించటం తనకు సాధ్యమయ్యే పని కాదనుకొని వెనక్కు పరుగెత్తి పారిపోయాడు. వాలి సుగ్రీవులు అతడి వెంటపడ్డారు.

మాయావి చాలా దూరం పరుగెత్తి, పరుగెత్తి అక్కడున్న ఒక గుహలోకి చొరబడ్డాడు. ఆ గుహకు చాలా చిన్న ద్వారం ఉన్నది. అంత పెద్ద రాక్షసుడు ఆ సన్నని బిలంలో కెలా చొరబడ్డాడో అని వాలిసుగ్రీవులు ఆశ్చర్యపోయారు.

"ఏమైనా మాయావిని వదలిపెట్టగూడదు. వాణ్ణి మట్టుపెట్టి వస్తాను. వంటయింటి కుందేలు లాగా వాడీ బిలంలో చిక్కుకొన్నాడు. సుగ్రీవా! నీవిక్కడే ఉండు. వాణ్ణి చంపకుండా బయటికి రాను. తార గర్భవతిగా ఉంది. జాగ్రత్తగా చూడు," అని చెప్పి వాలి ఆ గుహ శిలలను బ్రద్దలుకొట్టి త్రోవ చేసుకొని లోపలికి వెళ్ళాడు.

సుగ్రీవుడు గుహద్వారం దగ్గర కనిపెట్టుకొని కూర్చున్నాడు. రెండు మూడు రోజులు గడిచాయి. వాలి వెలుపలికి రాలేదు. గర్భవతి అయిన తార కూడా గుహ వాకిటికి వచ్చి కూర్చున్నది. వాలి జాడ లేదు.

'అది ఎంత పెద్ద బిలమో ఏమో! ఆ బిలం నుండి వారిద్దరూ ఎక్కడికి వెళ్ళి పోరాడుతున్నారో ఏమో! అయినా ఓపిక పట్టాలి,' అనుకొని నెల రోజులు సుగ్రీవుడు ఆ గుహ దగ్గరే తిష్ట వేశాడు.

తార ప్రసవించింది. ఒక మగ శిశువును కన్నది. వాలి లక్షణాలను పుణికి పుచ్చుకొన్న ఆ శిశువు బలిష్ఠంగా, చక్కగా ఉన్నాడు. వాలి రాకపోయేనే అని తార విచారపడసాగింది.

సుగ్రీవుడు తాను గుహ దగ్గర ఉండే అన్ని వేడుకలు జరిపించాడు. పెద్దలందరు విచ్చేసి వాలి కుమారుడికి 'అంగదుడు' అని నామకరణం చేశారు. మహావైభవంగా జన్మోత్సవం జరిపించి, సుగ్రీవుడు వాలి లేని లోటు తీర్చాడు.

సుగ్రీవుడు అనతిస్తే చాలు, అతడెక్క

డున్నా, తమ తమ విధులను తూచా తప్ప కుండా నిర్వహించటం ప్రజలకు అలవాటయి పోయింది.

కిష్కింధా నగరంలో ఆనందోత్సవాలు కోలాహలంగా జరిగాయి. మరొక నెల గడిచింది. ఇంకొక నెల గడిచింది. వాలి ఆ గుహ నుంచి తిరిగి రానే లేదు. సుగ్రీవుడు తారను ఓదార్చాడు.

"వాలి తరవాత రాజ్యపాలనం చేయదగిన వివేకం కలదానివి నీవు. నీవే సింహాసనం అధిష్టించి పరిపాలన సాగించవలసింది," అని తారను కోరాడు సుగ్రీవుడు.

తార అందుకు ఇష్టపడక, "అంగదుణ్ణి యువరాజును చేసి, నీవే రాజ్యపాలనం చేయవలసింది," అని సుగ్రీవుణ్ణి కోరింది.

తార వివేకానికీ, బుద్ధి కుశలతకీ హనుమ దాది మంత్రులందరూ సంతోషపడుతూ వెళ్ళి, సుగ్రీవుణ్ణి రాజ్యాధికారం చేపట్టవలసిందని ఏకగ్రీవంగా కోరారు. ప్రార్థించారు. వారి విన్నపం విని సుగ్రీవుడు గుహ వైపు దీనంగా చూచాడు. తన అన్న ఎంతకాలానికీ వెలుపలికి రానందుకు కంట నీరుపెట్టాడు. గుహలో ఒక పగులు నుండి రక్తం స్రవించటం చూచామని కొందరు చెప్పారు. మహా పరాక్రమవంతుడైన వాలి హతుడైనాడని సుగ్రీవుడు అనుమానించాడు. మాయావి బారినుండి తారను రక్షించవలసిన బాధ్యత ఇక తనపై పడ్డది. అందుకు

ఆ గుహ ద్వారాన్ని ఐంద రాళ్ళతో మూసి వేయించాడు సుగ్రీవుడు.

కిష్కింధకు వచ్చి సుగ్రీవుడు తన అన్నను తలచుకొని బోరున దుఃఖించాడు. తార సుగ్రీవుణ్ణి ఓదార్చింది. సుగ్రీవ పట్టాభిషేకానికి హనుమంతుడు అన్ని ఏర్పాట్లూ చేశాడు. సాగర జలాలు తెప్పించి, పూర్ణకుంభాలతో సుగ్రీవుణ్ణి శాస్త్రీయంగా అభిషేకించి అంగదుణ్ణి యువరాజును చేశారు. కిష్కింధలో ఉత్సవాలు, వేడుకలు జరిగాయి. సుగ్రీవుడితో పాటు అతడి భార్య రుమను, తారను పల్లకీలో కూర్చుండబెట్టి ప్రజలు ఊరేగింపు జరిపారు. పూలు, మంగళాక్షతలు చల్లారు.

ఒకనాడు సుగ్రీవుడు గద్దెమీద కూర్చుండి

కొలువుదీర్చి ఉన్నాడు. చుక్క తెగి పడిన విధంగా వచ్చి వాలి రాజభవనంలోకి గబగబ ప్రవేశించాడు. పళ్ళు పటపట కొరుకుతూ, కళ్ళెర్ర చేసి సుగ్రీవుణ్ణి చూచి నేరుగా అంతఃపురం లోనికి వెళ్ళాడు. అక్కడ తార కనిపించలేదు. సుగ్రీవుడి అంతఃపురంలోనికి వెళ్ళాడు. అక్కడ తార, రుమ సరససల్లాపాలాడుకొంటూ కనిపించారు.

తార వాలిని చూడగానే కళవళ పడ్డది. తర్వాత, ఆమెకు పోయిన ప్రాణం లేచి వచ్చినట్లయింది.

వెంటనే అంగదుణ్ణి తీసికొని వచ్చి చూపి, "ఇడుగో, మీ పుత్రుడు!" అని అందించింది తార.

కుమారుణ్ణి చూచేసరికి వాలి కోపం సగం తగ్గింది. తార తన భర్తకు ఏమో చెప్ప బోయింది. 'ఛీ!' అని చీదరించుకొని ఒక్క విసరున వాలి మరొక గది లోనికి వెళ్ళాడు. తారకు నోట మాట రాలేదు. అలాగే నిలబడి పోయింది.

ఇంతలో సుగ్రీవుడు పరుగు పరుగున వచ్చి వాలికి సాష్టాంగపడి నమస్కరించాడు. కొలువులోని వారందరూ అక్కడికి వచ్చి వాలికి మ్రొక్కారు.

"అన్నా, నీ కోసం సంవత్సరంపాటు గుహ దగ్గర వేచి ఉన్నాను. నీవు ఎంతకాలానికీ రాక పోయే సరికి...." అని సుగ్రీవుడు చెబుతుండగా, వాలి పూర్తిగా వినిపించుకోకుండానే, "ఛీ, దుర్మార్గుడా! నీ ముఖం చూడకూడదు. భాతృద్రోహివి. పో అవతలికి," అని కసిరి కొట్టాడు.

ఆ మాటలకు మంత్రులందరూ భయ విహ్వాలై ఎటు వాళ్ళటు జారుకొన్నారు.

తన నిర్దోషతను నిరూపించుకోవటానికి సుగ్రీవుడికి అవకాశమివ్వనేలేదు వాలి. తర్వాత తార చెప్పిన మాటలు కూడా అసత్యాలని త్రోసి పుచ్చాడు.

మరునాడు సభకు నగరప్రముఖులను పిలిపించి వాలి ఇలా చెప్పాడు.

"మాయావి అనే రాక్షసుడు నాకు ప్రబల శత్రువు. వాడు నాతో పోరాడటానికి వచ్చాడు.

అతణ్ణి తరుముకొంటూ పోయి నే నొక గుహలో చొరబడ్డాను. ఆ గుహకు మరో మార్గం లేదు. ఉన్న ఒక్క మార్గమూ చాలా చిన్నది. మాయావి ఆ గుహలో చొరబడి నన్ను చాలా త్రిప్పలు పెట్టాడు. మా యిద్దరికి అక్కడ చాలా చోట్ల యుద్ధం జరిగింది. నేను గుహ లోపలికి వెళుతూ సుగ్రీవుణ్ణి అక్కడ ఉండ మన్నాను. నేను గుహనుంచి వెలుపలికి రావటం ఇతడికి ఇష్టం లేదు. ఆ గుహ దారాన్ని బండరాళ్ళతో మూసి వేయించాడు.

“మాయావిని హతమార్చి చాలా శ్రమపడి వస్తూన్న నాకు ఆ ద్వారం బ్రద్దలు కొట్టటానికి నెల రోజులు పట్టింది. గుహనుంచి రాగానే వీడు నేను అనుమానించినట్లుగానే నా సింహాసనం మీద సిగ్గూ, శరమూ లేకుండా కూర్చుని రాజ్యమేలుతున్నాడు. తాను రాజు కావాలన్న ఆశతో ఇంతటి నీచానికి పాల్పడ్డాడు. ఇంకా ఇతడి దుర్మార్గం గురించి చెప్పవలసింది ఉన్నది. కాని, చెప్పను.”

ఆ మాటలు సభలో ఒకడై ఉండి విని, సుగ్రీవుడు అన్నకు సాష్టాంగపడి నమస్కరించి, “నేను నిర్దోషిని,” అని వేడుకొన్నాడు.

“ఛీ, నీ ముఖం చూపించకు. పో, అవతలికి. నా రాజ్యంలో నీ కిక తావు లేదు. నీవు చేసిన దుర్మార్గానికి నిన్ను చంపకుండా వదిలిపెడుతున్నాను. నీకు దేశ బహిష్కరణ శిక్ష విధిస్తున్నాను,” అని గద్దించి పలికి సభ చాలించి లోపలికి వెళ్ళి పోయాడు వాలి.

అన్నకు నమస్కరించి సుగ్రీవుడు కన్నీళ్ళతోను, కట్టుబట్టలతోను బయలుదేరాడు. హనుమంతుడు, మరి కొందరు వానర ప్రముఖులు సుగ్రీవుణ్ణి అనుసరించి కోట దాటి వెళ్ళిపోయారు. ఆ దుఃఖంలో సుగ్రీవుడు తన సంసారం సంగతే మరిచిపోయాడు. కోపిష్ఠి, దురహంకారి, మూర్ఖుడు అయిన వాలి పరిపాలనలో తమకు భద్రత ఉండదని చాలా మంది వానరులు సుగ్రీవుణ్ణి అనుసరించారు.

—(ఇంకా ఉంది)



ఒక్కటే లోపం

సోమయ్యది గాజు సామానుల దుకాణం. గాజు సామానుల మీద రోజూ దుమ్ము పడి పోతూంటుంది. ఆ దుమ్ము ఏ రోజుకా రోజు తుడవకపోతే సామాను ఆకర్షణీయంగా ఉండదు. సోమయ్యా ఆ తుడిచే పని చేసుకోలేక పనివాణ్ణి పెట్టుకోవాలనుకున్నాడు. అయితే, ఏ పనివాడూ సరిగా ఉండటం లేదు. కొందరు పరిశుభ్రంగా చేయటం లేదు. కొందరు డబ్బులు దొంగిలిస్తున్నారు. కొందరు ఒక రోజొస్తే మరో రోజు రావటం లేదు. సరైన పనివాడు దొరక్క సోమయ్యా చాలా అవస్థపడుతున్నాడు.

ఒక రోజున పొరుగింటి నాగయ్యా తన కొడుకు రాజును తీసుకొని వచ్చి, "ఒక్క లోపం తప్పిస్తే, వీడు చాలా శ్రద్ధగా పని చేస్తాడు బాబూ," అన్నాడు.

"పని శుభ్రంగా చేస్తాడా?" అని అడిగాడు సోమయ్యా.

"వీడు తన చేతితో ఏది తుడిచనా తళతళలాడి పోవలసిందే అన్నాడు నాగయ్యా.

"దొంగబుద్ధి ఉందా?" అని అడిగాడు సోమయ్యా.

"పూచికపుల్ల కూడా ముట్టడు బాబూ!" అన్నాడు నాగయ్యా.

"పనికి రోజూ వస్తాడా లేక, అప్పుడప్పుడు ఎగనామం పెడతాడా?" అన్నాడు సోమయ్యా.

"రాత్రింబవళ్ళు రమ్మన్నా వస్తాడు. దుకాణంలోనుంచి మీరు పొమ్మనేదాకా పోడు," అన్నాడు నాగయ్యా.

"అయితే ఇంకేం? ఇతర లోపాలుంటే నే సర్దుకుంటానులే," అని సోమయ్యా రాజును పనిలో పెట్టుకున్నాడు.

చేరిన మరునాడే పది గాజు సీసాలు బద్దలు కొట్టాడు రాజు. సోమయ్యా వెంటనే నాగయ్యాకు కబురు పంపి సంజాయిషీ అడిగాడు.

"వాడికి ఒక్క లోపం వుందని చెప్పాను కదా బాబూ? వీడి చెయ్యి కాస్త వదులు, అంతే!" అన్నాడు నాగయ్యా వినయంగా.

—జె. రామలక్ష్మి



భీమకవి వాక్కు

పూర్వకాలంలో వేములవాడ భీమకవి అనే కవి వుండేవాడు. అతడు ఈశ్వరుడి వరంవల్ల పుట్టినవాడు.

వేములవాడ భీమకవి శాపానుగ్రహ సమర్థుడు. అతడి నోటివెంట ఏది పలికితే అది క్షణాలలో నిజమై కూర్చునేది.

భీమకవి వుండే వూరిలోనే లేటవరపు పోతరాజు అనే వ్యక్తి వుండేవాడు. పోతరాజు మహా పిసినారి. ఎవరికైనా బాకీ పడితే ఆ బాకీని మామూలు పద్ధతిలో తీర్చటం అతడికి అలవాటు లేదు.

ఒకసారి పోతరాజు భీమకవికి కొంత పైకం బాకీ పడ్డాడు. ఎన్ని నాళ్ళు గడిచినా పోతరాజు ఆ బాకీ తీర్చలేదు.

ఇది యిలా వుండగా, ఒకనాటి ఉదయం భీమకవి పోతరాజు వుండే వీధి కుండా వస్తూ వున్నాడు.

అది చూచి బయటికి ఎక్కడికో పోతూన్న పోతరాజు గబగబ ఇంటి లోపలికి పరుగెత్తాడు. తాను యివ్వవలసిన బాకీని తీర్చమని, భీమకవి అడుగుతాడేమోనని అతడికి భయం పట్టుకుంది.

వెంటనే ఆ బాకీ తీర్చేందుకు పోతరాజుకు యిష్టం లేదు. అందువల్ల భార్యను పిలిచి, భీమకవి అడిగితే తాను యింటిలో లేడని చెప్పమన్నాడు.

పోతరాజు భార్య మెల్లగా భయపడుతూనే బయటికి వచ్చింది. అప్పటికే భీమకవి వాకిట్లో నిలిచి వున్నాడు.

భీమకవి ఆమెను చూచి, "అమ్మా, పోతరాజు ఇల్లు ఇదే కదా! ఆయన ఇంటిలో వున్నాడా?" అని అడిగాడు.

భర్త చెప్పమన్నట్లుగా ఆమె భీమకవికి తన భర్త ఇంటిలో లేడనీ ఎక్కడికో వెళ్ళాడనీ బొంకింది.

క్షణాల్లో జరిగినది ఏమిటో గ్రహించాడు

యర్రమిల్లి రంగనాయకి

భీమకవి. దానితో అతడికి చాలా కోపం వచ్చింది. ఆమెను మరో ప్రశ్న అడగకుండా భీమకవి ఈ క్రింది పద్యం చదివాడు.

"కాటికి గట్టెలు చేరెను
యేటావల గుంపు గూడి యేడువ
సాగెన్
కూటికి గాకులు వచ్చెను
లేటవరపు పోతరాజు లేడా, లేడా!"

ఈ పద్యం చదివి భీమకవి తన దారిన తాను వెళ్ళి పోయాడు. పోతరాజు భార్య ఆ సంగతి చెపుదామని ఇంటిలోపలికి వెళ్ళింది. ఆమెకు పోతరాజు ప్రాణాలు పోయి నిర్జీవుడై కనిపించాడు. పోతరాజు భార్య ఏడుస్తూ పరుగు పరుగున పోయి, భీమకవి పదాలపైన పడి, తమ తప్పును క్షమించమని వేడు కొన్నది.

ఆమె విచారాన్ని చూచి, భీమకవి మనస్సు కరిగి పోయింది. అప్పుడు ఈ విధంగా మరో పద్యం చ[illegible]డు.

"నాటి రఘురాము తమ్ముడు
పాటిగ సంజీవి చేత బ్రతికిన భంగిన్
కాటికి బో నీ కేటికి
లేతవరపు పోతరాజ! లెమ్మా! రమ్మా!"

ఈ పద్యం పూర్తి అవుతూనే పోతరాజుకు పోయిన ప్రాణం తిరిగి వచ్చి, లేచి బయటికి వచ్చాడు.

ఇంతలో, పోతరాజు భార్య అక్కడికి వచ్చింది. భర్త బ్రతికి వుండటం చూచి, ఆమె ఎంతో సంతోషించి, జరిగినదంతా భర్తతో చెప్పి భీమకవికి క్షమాపణలు చెప్పుకోమనీ, ఆయన బాకీని వెంటనే తీర్చమనీ చెప్పింది.

దానితో పోతరాజు తన తప్పు తెలుసు కొన్నాడు. వెంటనే భీమకవి దగ్గరికి వెళ్ళి తాను యివ్వవలసిన పైకాన్ని సమర్పించి, తన తప్పును మన్నించమని వేడుకొన్నాడు. భీమకవి అతణ్ణి దీవించి యింటికి పంపాడు.

ఈ విధంగా బుద్ధి వచ్చిన పోతరాజు, ఆ తర్వాత అలాంటి పని ఎన్నడూ చేయలేదు.



ప్రత్యేకమైనది

పై బొమ్మల్లో ఏదో ఒకటి మాత్రమే మిగత వాటితో సంబంధం లేకుండా ప్రత్యేకతను నిలుపుకున్నది. అది ఏది?

5 మార్కులు

ఏమిటివి?



పైన కొన్ని బొమ్మలున్నాయి. వాటిని మనం రోజూ చూస్తూనే వుంటాం. అయితే, అది ఈ విధంగా కాక పోవచ్చు. కొంచెం జాగ్రత్తగా చూచి వాటి పేర్లను వ్రాయండి.

10 మార్కులు

నవ్వు రావాలి



పైన నాలుగు జంతువుల ఆకారాలు వున్నాయి. ముక్కూ, కళ్ళూ, నోరూ వగైరా లతో వాటిని నింపండి. అలా చేసినప్పుడు నవ్వు పుట్టించే విధంగా వుండాలి అన్నది షరతు.

10 మార్కులు

ఏమనిపిస్తూంది?

పై వాటిని చూడగానే మీకు ఏమనిపిస్తూందో వ్రాసి పంపండి.

5 మార్కులు

బొమ్మరిల్లు పరీక్షా పత్రం

పరీక్షలకు వెళ్ళినప్పుడు ప్రశ్నాపత్రంలో వున్న ప్రశ్నలన్నిటికి జవాబు తెలియాలని లేదు. కొన్ని తెలిసినా చక్కటి మార్కులతో 'పాస్' అయ్యే అవకాశాలు వుంటాయి. అలాగే ప్రక్క పేజీలలో అనేక పజిల్స్ వున్నాయి. వాటిలో కొన్ని తేలికవి కొన్ని కష్టమైనవి. ప్రతి పజిలుకు కొన్ని మార్కులున్నాయి. ఏ కొన్ని పూర్తి చేసి పంపినా బహుమతి లభించవచ్చు. పజిల్సును పూర్తిచేసి పంపితే, వాటికి మార్కులు వేసి, ఎక్కువ మార్కులు సంపాదించుకున్న మొదటి ఇరవైమందికి బహుమతులు పంపుతాము. బహుమతులు గెలుచుకున్న వారిలో మొదటి ముగ్గురి ఫోటోలు కూడా ప్రచురించగలము.

బహుమతి వివరాలు

1.	ఎక్కువ మార్కులు తెచ్చుకున్న మొదటి ముగ్గురికి....	ఒక్కొక్కరికి 50 రూపాయలు
2.	అలాగే 4, 5, 6, 7, 8, 9, 10వ పాఠకుడి వరకు....	ఒక్కొక్కరికి 20 రూపాయలు
3.	11వ పాఠకుడి నుండి 20వ పాఠకుడి వరకు....	ఒక్కొక్కరికి 5 రూపాయలు

నిబంధనలు

1. పజిల్సు పంపే కవరులో కథలు కార్టూన్సులాంటివి ఏవి వుంచరాదు.
2. ముగింపు తేది: ఈ సంచిక విడుదలైన 20 రోజులలోగా.
3. పజిల్సు ఎవరు ఎక్కువ కరెక్టుగా వ్రాశారో తేల్చేందుకు చాలా వ్యవధి పడుతుంది గనుక, బహుమతి పొందినవారి ఫోటోలు, పేర్లు రాబోయే సంచికలోగాక, ప్రతిసారి, ఆ పై సంచికలో మాత్రమే ప్రచురిస్తూ వుండగలము.
4. పజిల్సులో పాల్గొనదలచినవారు, తప్పనిసరిగా పజిల్సు పంపే కవరుపైన ఈ క్రింద వున్న ఎడ్రస్ 'కట్' చేసి అంటించి పోస్ట్ చేయవలెను.
5. తుది తీర్పు సంపాదకుడిదే.

Bommarillu
80, Dhanalaxmi Colony,
Vadapalani Madras-600 026.

పేరు ఏమిటి?

ఒకసారి ఒక ఉపాధ్యాయుడు తరగతిలోని పిల్లలందరికీ ఈ క్రింది బొమ్మలను చూపుతూ తన పేరూ, ఊరూ వానిలో దాగివున్నాయని చెప్పాడు. అది నిజమే. బొమ్మల పేర్లు వ్రాసుకుని వాటిలోని మొదటి అక్షరాలను మాత్రమే ఉపయోగిస్తూ అతడి పేరూ, చివరి అక్షరాలు మాత్రమే ఉపయోగించి ఊరూ కనుక్కోండి.

10 మార్కులు



వస్తువుల పేర్లు

పైన వున్న వృత్తాకారములలో, మీ యిష్టమొచ్చిన దిశలో వెళుతూ కొన్ని వస్తువుల పేర్లు నింపండి. అయితే, అవి అన్నీ ఒకే చెట్టు నుంచి లభిస్తూ, మనిషికి ఉపయోగడేవిగా వుండాలి. మధ్యలో వున్న వత్తాకారం నుంచి ప్రతి పేరూ మొదలు పెట్టాలన్నది షరతు. 5 మార్కులు

ఏమిటిది?



5 మార్కులు



పూరించండి

పైన వున్న అంకెలు ఒక క్రమంలో వున్నాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించి ఖాళీ గడిని పూరించండి.

5 మార్కులు

దారి గీచి పంపండి

5 మార్కులు



బొమ్మ చేసి పంపండి

ఈ ప్రక్కన ఒక బొమ్మ తాలూకు చాలా ముక్కలు వున్నాయి. వాటిని జాగ్రత్తగా కత్తిరించి, అటూ ఇటూ మార్చి, ఒక కాగితం మీద అంటించి బొమ్మ తయారు చేయాలి. ఆ బొమ్మలో ఏమేమి వస్తువులు వున్నాయో వివరంగా వ్రాసి పంపండి.

20 మార్కులు

ఏది పెద్దది? ఏది చిన్నది?

రెండు అంగుళాల గీత గీచి, దాన్ని ఒక భుజంగా తీసుకుని, దాని మీద ఒక త్రిభుజాన్ని, చదరాన్ని, దీర్ఘ చతురస్రాన్ని గీచామనుకోండి. అందులో ఏది పెద్దదో, ఏది చిన్నదో వివరించండి. 5 మార్కులు

ఏ కథ లోనివి?

1. "మీరు చెప్పినట్లు వింటాను." 2. "మీరు చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోలేను." 5 మార్కులు

కారణమేమిటి?

శాంతియుత ప్రయోజనాల కోసం, భారతదేశం భూగర్భ అణువిచ్ఛేదక ప్రయోగం చేసింది. ఆ సమయంలో, ఆ ప్రయోగం జరిగిన చోట చూస్తూ వుండగానే పెద్ద గుంట ఏర్పడగా, దాదాపు అంతే పరిమాణం గల ఒక కొండ కొంత దూరంలో ఏర్పడింది. కారణం వివరించండి. 5 మార్కులు

మీరేం చేస్తారు?

ఒక తరగతిలో ఉపాధ్యాయుడు, 'ఆవు మీద వ్యాసం వ్రాసుకొని రండి,' అని విద్యార్థులకు చెప్పాడు. ఒకడు ఆవు శరీరం మీద, 'వ్యాసం' అని వ్రాసి తరగతికి తీసుకుని వచ్చాడు. మీరైతే ఏం చేస్తారు? 5 మార్కులు



దేవీ కటాక్షం

భోజమహారాజు కాళిదాసుకు ఎక్కువగా సన్మానాలు చేస్తున్నాడనీ, ఆయనపై అపారమైన ప్రేమను చూపుతున్నాడనీ తక్కిన కవి పండితులకు కోపంగా ఉండేది. అయితే కాళిదాసును ఎలా ఓడించాలో వారికి అర్థం కాలేదు. అందుకని వారందరూ కలిసి ఒక యుక్తి పన్నారు.

"మనమందరమూ ముందుగానే బాగా యోచించుకొని, శ్లోకాలని తయారు చేసుకొని పోటీకి వెళ్ళుదాము. మహారాజుకు చెప్పి పోటీకి కాళిదాసును కూడా రావలసిందిగా పిలుద్దాం. అప్పుడు కాళిదాసు వస్తాడు. మనం వరుసగా ముందే సిద్ధం చేసుకున్న శ్లోకాలని పోటీలలో చదువుదాం. ఎంత కష్టపడ్డా, కాళిదాసు అప్పటికప్పుడే అశువుగా కవిత్వం చెప్పాలి. కాబట్టి, ఓడిపోక తప్పదు," అనుకున్నారు పండితులు.

ఆ తర్వాత అందరూ వెళ్ళి, భోజమహారాజు దర్శనం చేసుకొని, "ప్రభూ, మా కొక సారి శతావధానం చేయాలనే కోరికగా ఉంది. అందుకని తగిన అవకాశం ఇప్పించండి. అందులో కాళిదాసు కూడా పాల్గొనాలి. మేమందరమూ మా మా పాండిత్యాలు తమరి ముందు ప్రదర్శిస్తాము. ఎవరి యోగ్యతను అనుసరించి వారికి మీరు సన్మానం చేయండి," అన్నారు.

భోజమహారాజు అందుకు సంతోషించాడు. వెంటనే కాళిదాసుకు కబురు పెట్టాడు. అయితే, అప్పుడు కాళిదాసు 'శాకుంతలం' అనే మహాకావ్యాన్ని వ్రాస్తూ ఉన్నాడు. అందువల్ల, తా నిప్పుడు అలాంటి పోటీలలో పాల్గొనలేననీ, దానివల్ల తన కావ్య రచనకు ఇబ్బంది కలుగుతుందనీ కబురు పంపాడు.

అది విని పండితులు భోజమహారాజుతో, "చూచారా, మహాప్రభూ! సమయం వచ్చే సరికి కాళిదాసు ఎలా తప్పించుకున్నాడో!

పోటీలో పాల్గొంటే ఓడిపోతాననే భయం కలిగి ఈ విధంగా ముఖం తప్పించాడు,” అన్నారు.

భోజమహారాజుకు ఇది అవమానంగా తోచి, “ఏమయినా సరే నీవు పోటీలో పాల్గొనక తప్పదు,” అని కాళిదాసుకు మరోసారి కబురు చేశాడు.

రాజాజ్ఞను కాదనలేక కాళిదాసు పోటీలో పాల్గొనటానికి అంగీకరించాడు.

ఈ పోటీలో మధ్యవర్తిగా ఉండటానికి, భోజమహారాజే అర్హుడని పండితులందరూ తీర్మానించారు. పోటీ రాజసభలో జరగాలని వారందరూ కోరారు కూడా.

అయితే, కాళిదాసు అందుకు అంగీకరించలేదు. పోటీ కాళికాదేవి దేవాలయములోని కళ్యాణమంటపంలో జరగాలని కాళిదాసు కోరాడు.

“ప్రభూ, ఈ పోటీలో తీర్పు మీరు యిస్తే సంతోషమే. కాని, మీరు కాకుండా వేరొకరు మధ్యవర్తిగా ఉంటే బాగుంటుందని నా ఉద్దేశ్యం,” అన్నాడు కాళిదాసు.

అది విని పండితులందరూ కోపంతో మండిపడి, “చూచారా, ప్రభూ! కాళిదాసు మిమ్మల్ని ఎలా అవమానిస్తున్నాడో! ప్రభువుల వారికన్నా గొప్ప పండితుడు ఎవరున్నారు?” అంటూ మెల్లగా భోజమహారాజుకు కోపం వచ్చే విధంగా మాట్లాడసాగారు.

భోజమహారాజు కొంచెం సేపు ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత, తనకంటే గొప్ప పండితుడు వస్తే, అతడే మధ్యవర్తిగా ఉండేందుకు తాను అంగీకరిస్తానంటూ చెప్పాడు.

మరునాడు కళ్యాణమంటపంలో పోటీ ప్రారంభమైంది. కాళిదాసు ఒక మూల కూర్చొని, ఈ పోటీ ఏమీ తనకు పట్టనట్లుగా ఏదో వ్రాసుకుంటున్నాడు.

“నీవు తెస్తానన్న మధ్యవర్తి ఏది?” అని వాళ్ళు కాళిదాసును ప్రశ్నించారు.

“ఆ మధ్యవర్తి వచ్చారు. ఇక్కడే ఉన్నారు. మీరు పోటీ మొదలు పెట్టండి. ఎవరు గొప్పవారో తేల్చబడుతుంది,” అన్నాడు కాళిదాసు.

పండితులు పోటీ మొదలు పెట్టారు. పోటీలో పండితులందరూ పాల్గొంటున్నారు. వారు ముందే బాగా తయారయి వచ్చారు. కాబట్టి, పోటీలో ఒకరిని మించి ఒకరు గొప్పగా శ్లోకాలు చెపుతున్నారు. భోజమహారాజు కూడా అది చూచి ఆశ్చర్యపోయాడు.

ఇంతలో, కాళిదాసు వంతు వచ్చింది. కాళిదాసు తలవంచుకొని తన పని తాను చేసుకొంటూనే వాళ్ళకు ఏదో సమాధానం శ్లోకంలో చెప్పేస్తున్నాడు. విచిత్ర మేమంటే కాళిదాసు చెప్పుతూన్న సమాధానం మిగిలిన అందరు పండితుల సమాధానం కన్నా చాలా అద్భుతంగా ఉంటున్నది.



ఇలా పోటీ పగలంతా నడిచింది. అప్పటికి పండితులందరూ అలిసిపోయారు. కాళిదాసు మాత్రం ఏమీ అలసి పోకుండా రాత్రి ఎంత పొద్దుపోయినా శ్లోకాలు అవలీలగా చెబుతూనే ఉన్నాడు. దీనితో అక్కడ చేరిన పండితు లందరూ ఆశ్చర్యపోయారు. చివరకి పండితు లందరూ పోటీ ఇక చాలునని భోజమహారాజును ప్రార్థించారు.

"ఇప్పుడు ఈ పోటీలో ఎవరు గెలిచినట్లో ప్రభువులవారు నిర్ణయించాలి," అన్నారు పండితులు.

"కాళిదాసు తానెవరో మధ్యవర్తిని పెట్టానన్నాడు కదా! ఆయననే నిర్ణయింపనివ్వండి," అన్నాడు భోజమహారాజు.

అందరూ కాళిదాసు వైపు చూచారు.

అప్పుడు కాళిదాసు దేవాలయంలోని గర్భగుడి వైపు తిరిగి, "చెప్పు, తల్లీ! ఇక్కడి పండితు లందరిలోనూ ఎవరు గొప్పవారు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు అమ్మవారి విగ్రహం నుండి, "కాళిదాసే మహాకవి, కాళిదాసే మహాకవి! ఆయనకు సమస్త భూప్రపంచం కానుకగా ఇచ్చినా సరిపోదు," అనే మాటలు వినిపించాయి.

అది విని మిగిలిన పండితులందరూ దిగ్భ్రాంతులయినారు.

"మరి మా మాటేమిటి తల్లీ!" అన్నారు ఆ పండితులు.

అప్పుడు కాళికాదేవి విగ్రహం నుండి ఈ శ్లోకం వినిపించింది.

"లక్షం మహాకవేర్దేయం
తదర్థం విబుధస్యచ
దేయంగ్రామైక మర్థస్య
తస్యాప్యర్థం తదర్థినః"

'ఈ కూర్చున్నవారిలో ఫలానా మహాకవికి లక్ష రూపాయలు ఇవ్వండి చాలు. ఆ తర్వాత వాడికి ఏభై వేలు ఇవ్వండి. అవతలవాడికి ఒక చిన్న గ్రామం అగ్రహారంగా ఇవ్వండి. మిగిలిన కవులకు అర గ్రామం, అందులో సగం బహుమానంగా ఇస్తే చాలా ఎక్కువ,' అని దీని అర్థం.

కాళికాదేవి స్వయంగా చెప్పిన ఈ మాటలను భోజమహారాజూ, మిగిలిన పండితులందరూ విన్నారు. కాళికాదేవి అజ్ఞానుసారం అందరూ తల వంచుకొని వెళ్ళిపోయారు. కాళిదాసు అలాగే కూర్చొని ఏదో వ్రాసుకుంటూనే వున్నాడు.

భోజమహారాజు కాళిదాసును ప్రశంసించి, "కాళిదాసూ, సాక్షాత్తు అమ్మవారే నిన్ను మహాకవిగా నిండు సభలో గుర్తించింది. అమెనే నీవు మధ్యవర్తిగా పెట్టినట్లు నాతో ముందే ఎందుకు చెప్పలేదు?" అని అన్నాడు.

అది విని కాళిదాసు నవ్వి, "ప్రభూ, మీరు మధ్యవర్తిగా ఉన్నా, నా కవిత్వాన్నే మెచ్చుకొని ఉండే వారు. అయితే, భోజమహారాజు పక్షపాతంతో ఇలా చెప్పాడని మిగతా కవి పండితులు మిమ్మల్ని ఆడిపోసుకుంటారనే నేనిలా చేశాను!" అన్నాడు.

"మరి పోటీ జరుగుతున్నంత సేపూ నీవు ఏమిటి వ్రాసుకొంటున్నావు?" అని భోజ మహారాజు ప్రశ్నించాడు.

"నేనొక మూల కూర్చొని కావ్యం వ్రాసుకొంటున్నాను. పోటీలో నన్ను కవిపండితులు అడిగిన ప్రశ్నలన్నింటికీ నా నోట కాళికాదేవియే సమాధానం చెప్పింది," అని కాళిదాసు వివరించాడు.



మునివాహనుడు

పూర్వం శ్రీరంగపుణ్యక్షేత్రంలో శ్రీరంగనాథుడి దేవాలయప్రాంతంలో వాసుదేవాచార్యుడు అనే భక్తుడు ఉండేవాడు. అతడు ప్రతి దినమూ తెల్లవారు జామునే లేచి, పరిశుభ్రముగా స్నానం చేసి, బావి దగ్గరకు వెళ్ళి బిందెతో బిందెడు నీళ్ళు మడిగా తోడుకొని, శ్రీరంగనాథుడి ఆలయం లోపలికి వెళ్ళేవాడు. ఆ నీళ్ళతో స్వామివారికి తిరుమార్జనం చేయించి పూజలు చేసేవాడు. వాసుదేవాచార్యుడి భక్తి చూచి, దేవాలయాధిపతులు ఆయననే పూజారిగా ఉండమని కోరారు. అందుకు వాసుదేవాచార్యుడు అంగీకరించాడు.

శ్రీరంగంలోని మాలవాడలో భక్తిదాసు అనే ఒక హరిజనుడు వుండేవాడు. అతడు చిన్నప్పటి నుంచీ శ్రీరంగనాథుడిపై ఎంతో భక్తిని పెంపొందించుకున్నాడు. భక్తిదాసు క్రమంగా పెద్దవాడయిన తరవాత, ప్రతి దినమూ తెల్లవారు జామునే లేచి, స్నానం చేసి, తన యింట్లోనే శ్రీరంగనాథుణ్ణి పూజిస్తూ కూర్చునేవాడు.

ఇలా వుండగా ధనుర్మాసం వచ్చింది. ఇది వైష్ణవులకు చాలా ముఖ్యమయిన నెల. ఈ నెల రోజులూ తెల్లవారు జామునే లేచి భగవన్నామాన్ని సంకీర్తనము చేస్తూ, గోదాదేవి (ఆండాళ్) రచించిన పాశురములు గానం చేస్తూ వైష్ణవులు గడుపుతారు. ఈ నెల మొత్తం శ్రీరంగనాథుడి దేవాలయంలో ఎన్నో వైభవాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి. అందుకని భక్తులందరూ దేవుణ్ణి దర్శించుకోవటం కోసం, ప్రతి దినమూ తండోపతండాలుగా దేవాలయానికి వస్తూ వుంటారు.

ధనుర్మాసంలో భక్తిదాసుకు ప్రతిదినమూ శ్రీరంగనాథుణ్ణి దర్శించుకోవాలనే కోరిక కలిగింది. అందుకని ఒకనాటి ఉదయం లేచి పరిశుభ్రంగా స్నానం చేసి శ్రీరంగనాథుడి దేవాలయానికి వెళ్ళాడు. అయితే గుడిలోకి

ఎం. ఎం. ఇందుశేఖర్



అయితే ధనుర్మాసంలో పూజ మొదలు పెట్టి, నెల రోజులు స్వామి వైభోగాలు చూడ కుండా మానేస్తే దానివల్ల ఫలితం దక్కదు కదా! అందువల్ల, భక్తిదాసు మరో మార్గం కనిపెట్టాడు. ఎవ్వరూ నిద్ర లేవక ముందే చీకటితోనే ఆలయానికి వచ్చి, ప్రాకారం బయటనుండే దేవుణ్ణి దర్శించుకొని, జనం అలికిడి వినబడేసరికి తిరిగి వెళ్ళిపోతూ వుండే వాడు.

ఇలా కొన్ని రోజులు గడిచాయి. ప్రతి దినమూ తెల్లవారక ముందే పూజారి వాసుదేవా చార్యుడు నీళ్ళ బిందెతో వచ్చేవాడు. అతణ్ణి చూడగానే భక్తిదాసు గోడపక్క నుంచి పారి పోతూ వుండేవాడు.

రోజూ ఎవడో గోడ పక్కన నక్కి పారి పోతున్నట్లు వాసుదేవాచార్యుడికి అనుమానం కలిగింది. 'ఏ దొంగ వెధవో స్వామివారి సొమ్మును కాజేద్దామని అలా వస్తున్నాడేమో,' అని అనుమాన పడ్డాడు. వాడి సంగతేమిటో మర్నాడు తేల్చి పారేయాలని నిశ్చయించు కున్నాడు.

మర్నాడు అర్ధరాత్రి వేళకాగానే వాసుదేవా చార్యుడు శ్రీరంగనాధుడి దేవాలయం వద్దకు వచ్చాడు. దూరంగా ప్రాకారానికి అవతల దాక్కున్నాడు. మామూలుగానే భక్తిదాసు తెల్లవారు జాముకు ముందే శ్రీరంగనాధుడి గుడి వద్దకు వచ్చాడు. ప్రాకారం పక్కనే

పోతే, తాను అంటరానివాడన్న భావనతో మిగిలిన వాళ్ళందరూ తనను చూచి కోపగించు కుంటారనే భయం భక్తిదాసుకు కలిగింది. అందువల్ల, భక్తిదాసు శ్రీరంగనాధుడి ప్రాకా రపు గోడ యివతలే నిలబడి దేవుడి వైభోగాన్ని చూస్తున్నాడు. ఇంతలో మడి నీళ్ళ బిందెతో వాసుదేవాచార్యుడు అటుగా వచ్చాడు. అతడు భక్తిదాసును గుర్తుపట్టి ఇలా అన్నాడు.

"ఓరోరి! నీవు ఈ దేవాలయం దగ్గరికి రావటానికి ఎంత సాహసంరా? ఇక్కడి నుంచి పోతావా, పోవా?"

అది విని భక్తిదాసు, ఎంతో భయపడి మరుక్షణమే అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ పారిపోయాడు.

నిలబడి ధనుర్మాసపు పాటలు పాడుకుంటూ దైవదర్శనం కోసం చూస్తూ వున్నాడు.

ఆ వచ్చిన వాడు భక్తిదాసేనని వాసుదేవాచార్యుడు గుర్తించి, "ఓరి దొంగవెధవా! ప్రతి దినమూ నువ్వేనన్నమాట గోడ చాటున నక్కుతున్నది. ఒకసారి తరిమేస్తే బుద్ధి రాలేదా?" అని కోపంతో ఒక రాయి తీసుకొని భక్తిదాసు మీదికి విసిరాడు.

ఆ రాయి భక్తిదాసు తలకు తగిలింది. భక్తిదాసు, 'అబ్బా!' అని పెద్దగా అరుస్తూ తల పట్టుకొని చీకట్లోకి పారిపోయాడు.

"అమ్మయ్య? వీడి పీడ వదిలింది!" అనుకొని సంతోషంతో వాసుదేవాచార్యుడు దేవాలయం లోపలికి వెళ్ళాడు.

గర్భగుడి తలుపులు తీసి స్వామివారి విగ్రహాన్ని చూచాడు వాసుదేవాచార్యుడు. స్వామివారి విగ్రహానికి తలపై నెత్తురు కారుతూ వున్నది. అది చూచి గజగజ వణికి పోయాడు.

"అపరాధం స్వామీ, అపరాధం! నేను చేసిన తప్పు ఏమిటో సెలవివ్వండి," అని ఏడ్చాడు వాసుదేవాచార్యుడు.

అప్పుడు గర్భగుడిలో నుంచి ఈ మాటలు వినిపించాయి.

"వాసుదేవా, భక్తిదాసు పరమభక్తుడు. అతడూ, నేనూ వేరు కాదు. భక్తుడికి తగిలిన దెబ్బ భగవంతుడికి తగిలినట్లేనని తెలియదా? నీ పాపానికి పరిహారంగా భక్తిదాసును నా సన్నిధానానికి తీసుకురా. వెంటనే వెళ్ళు."

ఈ మాటలు విని, వాసుదేవాచార్యుడు భయపడుతూ మాలవాడవైపు పరుగెత్తుకుంటూ



పోయాడు. అప్పుడే ఇల్లు చేరిన భక్తిదాసు తలకు మందు వేసుకొని కట్టు కట్టుకొంటూ వున్నాడు.

"నాయనా, భక్తిదాసూ! పరమాత్ముడు అనుగ్రహించాడు. నీవు వెంటనే నాతో శ్రీరంగ నాధుడి దేవాలయం లోపలికి రావాలి," అన్నాడు వాసుదేవాచార్యుడు.

వాసుదేవాచార్యుణ్ణి చూచి భక్తిదాసు భయపడి పోయాడు.

"నేను ఆలయం లోపలికి వస్తే, దేవాలయం మైలపడి పోతుంది. ఏమయినా సరే, దేవాలయం లోనికి నేను వచ్చేది లేదు," అని మొండికెత్తాడు భక్తిదాసు.

దేవుడి మాట నెరవేర్చకపోతే వాసుదేవాచార్యుడికి పుట్టగతులు వుంటాయా? అందుకని వాసుదేవాచార్యుడు బలవంతంగా భక్తిదాసును తన భుజాల మీదికి ఎక్కించుకున్నాడు. రెండు చేతులతోను గట్టిగా భక్తిదాసు తొడలను పట్టుకొని, భక్తిదాసు పారిపోకుండా చూచుకున్నాడు. ఆ విధంగా వాసుదేవాచార్యుడు శ్రీరంగనాధుడి దేవాలయం లోపలికి వెళ్ళి, స్వామివారి సన్నిధిలో భక్తిదాసును దించాడు. భక్తిదాసుపై అప్పుడు అకస్మాత్తుగా పూలవర్షం కురిసింది.

ఇంతలో, స్వామివారి సేవ కోసం భక్తులందరూ దేవాలయానికి రాసాగారు.

వారికి వాసుదేవాచార్యుడు జరిగినదంతా వివరంగా చెప్పి, "నా కన్నా కూడా భక్తిదాసే దేవుడికి ఎక్కువ ప్రేమ పాత్రుడు. దేవుడితోపాటు భక్తిదాసును కూడా మీరు పూజించండి," అని చెప్పాడు.

వాసుదేవాచార్యుడు పూజారి. కాబట్టి, మునీశ్వరుడితో సమానం. అతడి భుజాలపై మోయబడ్డాడు. కాబట్టి, ఆనాటి నుంచి భక్తిదాసుకు మునివాహనాళ్వారు అనే పేరు వచ్చింది. వైష్ణవులకు అత్యంత పవిత్రమయిన పన్నెండు మంది ఆళ్వారులలోనూ మునివాహనుడు కూడా ఒకడు.





పూర్వం దక్షిణాపథంలో సింహబలుడు అనే రాజు ఉండేవాడు. అతడికి మాళవరాజపుత్రి కళ్యాణవతి అనే భార్య ఉండేది. ఆమె మహా సౌందర్యవతి. సింహబలుడు ఆమెను ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించేవాడు.

ఇలా ఉండగా, ఒకసారి బలవంతుడైన శత్రురాజు వచ్చి, సింహబలుడి కోటను చుట్టు ముట్టాడు.

సింహబలుడు యుద్ధానికి సన్నిద్ధుడవుతూండగా, మంత్రి అతడి దగ్గరికి వచ్చి ఇలా సలహా ఇచ్చాడు.

"ప్రభూ, శత్రువు చాలా బలవంతుడు. అందువల్ల సొరంగమార్గం గుండా బయటికి పారిపోవటం మీకు క్షేమం అని అనిపిస్తున్నది."

అది హఠాత్తుగా వచ్చి పడిన యుద్ధం. కాబట్టి, సింహబలుడికి మంత్రి సలహా ఉచితంగా తోచింది. ఆ ప్రకారమే తన భార్య కళ్యాణవతిని వెంటబెట్టుకొని రహస్య సొరంగమార్గం గుండా కోటనుంచి తప్పించుకొని బయటపడ్డాడు.

అలా సింహబలుడు తన భార్యతో అరణ్యములూ, పర్వతములూ దాటిపోసాగాడు. ఒక అరణ్యం మధ్యనుండి పోతూ ఉండగా, ఒక భయంకరమయిన సింహం సింహబలుడి మీదికి దూకింది. సింహబలుడు దానిని అవలీలగా తన ఖడ్గంతో రెండు ముక్కలుగా నరికి వేశాడు.

మరికొంత ముందుకు సాగిపోయేసరికల్లా, పిచ్చి ఎక్కిన అడవి ఏనుగు ఒకటి తొండం పైకెత్తుకొని ఘీంకరిస్తూ సింహబలుడి మీదికి దూకింది. సింహబలుడు ఏమాత్రం భయపడకుండా దాని తొండం పట్టుకొని గిరగిర తిప్పి నేల కేసి కొట్టాడు.

సింహబలుడి బలం ముందు ఆ ఏనుగు నిలవలేక మట్టి కరిచింది.

ఇలా పోతూ ఉండగా, మరొక చోట ఒక

దొంగలగుంపు సింహబలుణ్ణి, కళ్యాణవతిని చుట్టుముట్టింది. వారిని చూచి కళ్యాణవతి గజగజ వణకసాగింది. సింహబలుడు ఆమెకు ధైర్యం చెప్పి, ఒరనుండి ఖడ్గాన్ని తీసి దొంగల గుంపు మీదికి దూకాడు. సింహబలుడు ఖడ్గంతో చిత్ర విచిత్రంగా యుద్ధం చేస్తూ, దొంగలనందర్నీ కొద్ది సేపటిలోనే సంహరించి వేశాడు.

ఇలా కష్టాలను ఎదుర్కొంటూ, వాటిని అధిగమిస్తూ వారిద్దరూ ముందుకు సాగిపోయారు. కొంతదూరం పోయాక, సింహబలుడు భార్యతో యిలా చెప్పాడు.

"కళ్యాణవతీ, మనమిప్పుడు మీ తండ్రిగారి ఇంటికి వెళుతున్నాము. ఆయనతో నీవు, 'నా భర్త అడవిలో ఇలా సింహాన్ని చంపాడు, అలా ఏనుగును సంహరించాడు,' అని చెప్పవద్దు. నాకు ఆ విధంగా వర్ణించి చెప్పుకోవటం ఇష్టం లేదు."

ఆ మాటలు విని, కళ్యాణవతి ఎంతో సంతోషించింది. ఆ తర్వాత కొద్దికాలానికే సింహబలుడు కళ్యాణవతితో మాళవ నగరం చేరుకున్నారు. మాళవ మహారాజు అల్లుణ్ణి ఎంతో ప్రేమతో ఆహ్వానించాడు.

సింహబలుడు తాను వచ్చిన పనిని వివరించి, "మామగారూ, నేను శత్రువులను జయించే నిమిత్తం కొంత సైన్యాన్ని సమకూర్చుకునేందుకు వెళుతున్నాను. త్వరలో తిరిగి వస్తాను. నేను వచ్చిన వెంటనే మీ సైన్యం కూడా నాకు సహాయంగా పంపండి. ఈ మొత్తం సైన్యంతో నేను తిరిగి వెళ్ళి,

శత్రువులను జయించి నా రాజ్యం స్వాధీనం చేసుకుంటాను," అని చెప్పి వెళ్ళిపోయాడు.

సింహబలుడు వెళ్ళిపోయిన తర్వాత కొంత కాలం కళ్యాణవతి, తన తండ్రి అంతః పురంలో ఒంటరిగా ఉండి పోయింది. ఒక నాడు ఆమె ఏదో ఆలోచిస్తూ కిటికీలోనుంచి వీధిలోకి చూస్తూ ఉన్నది. అప్పుడు వీధిలో ఒక అందమైన పురుషుడు పోతూ ఆమెకు కనిపించాడు. అతణ్ణి చూచి కళ్యాణవతి మనస్సు చలించింది. తన చెలికత్తెతో అతడికి కబురు పెట్టింది.

చెలికత్తె చెప్పిన ప్రకారం ఆ పురుషుడు ఒక పొడవైన తాడు ఆధారంగా అంతః పురంలోని పైభాగానికి ఎగబాకి, కిటికీలో కుండా లోనికి ప్రవేశించాడు.

కొంతసేపటికి కళ్యాణవతి ఆ గదిలోకి వచ్చింది. ఆమె తేజస్సును చూచి, అతడు భయంతో మంచం కింద దాక్కున్నాడు. కళ్యాణవతి అతడికి ధైర్యం చెప్పి, మంచం కిందనుంచి ఇవతలికి రమ్మన్నది. ఇంతలో ఆ మంచం కింద అతడికి ఒక పాము కనిపించింది. దానిని చూచి అతడు గజగజ వణికి పోసాగాడు.

"ఏమయింది?" అని ప్రశ్నించింది కళ్యాణవతి.

"పాము-పాము," అని భయంతో అతడు అరుస్తున్నాడు.

ఈలోగా పాము మంచం కిందనుండి పాకుతూ అవతలికి వెళ్ళి కిటికీ మీద వ్రేలాడుతున్నది. అప్పుడు పక్కనే ఉన్న ధనస్సును



కళ్యాణవతి అతడి చేతికి అందించింది. దానిని ఎక్కుపెట్టి అతడు బాణం సంధించాడు. ఒకే బాణంతో పాము చచ్చి కింద పడిపోయింది. అతడు పాము దగ్గరికి వెళ్ళి, దాన్ని అటూ ఇటూ కదిలించి చూచాడు. అది చచ్చిందని ఖాయం చేసుకోగానే అతడికి ఎంతో సంతోషం కలిగింది. ఆ సంతోషంతో గెంతటం మొదలు పెట్టాడు.

"మీరు ఎందుకు అలా గెంతుతున్నారు?" అని ప్రశ్నించింది కళ్యాణవతి.

"ఎందుకేమిటి? పామును చంపాను కదూ! పామును చంపిన వీరుణ్ణి!" అని జవాబిచ్చి మళ్ళీ అతడు గంతులు వేయసాగాడు.

అది చూచేసరికి కళ్యాణవతికి అసహ్యం వేసింది. తన భర్త ఏనుగునూ, సింహాన్నీ, గజదొంగలనూ సంహరించి కూడా తన ప్రతాపం ఇతరులకు చెప్పుకోవటానికి యిష్టపడ లేదు. ఈ నీచుడు మాత్రం ఒక చిన్న పామును చంపిన దానికే గర్వంతో గంతులు వేస్తున్నాడు. ఇటువంటి పౌరుషహీనుణ్ణి తాను మోహించినందుకు ఎంతో సిగ్గు పడింది. ఎంతో పశ్చాత్తాపం చెందింది కూడా.

"ఛీ, నీచుడా! ముందు బయటికి పో!" అని కళ్యాణవతి గద్దించింది.

దానితో అతడు భయపడి కిటికీ వైపు పరుగెత్తి, తాడు పట్టుకుని కిందికి దిగి, పరుగు పుచ్చుకున్నాడు.

ఆనాటి నుండి కళ్యాణవతి నిరంతరం తన భర్తనే రాత్రింబవళ్ళు స్మరిస్తూ కాలం గడిపింది. ఆ తర్వాత కొంతకాలానికి సింహబలుడు సైన్యాన్ని సమకూర్చుకొని వచ్చి, మాళవరాజు సైన్యసహాయం కూడా తీసుకొని వెళ్ళి, శత్రువులను చిత్తు చిత్తు చేశాడు. ఆ తర్వాత, కళ్యాణవతిని ఎంతో వైభవంతో మాళవనగరం నుంచి తన రాజ్యానికి తెచ్చుకున్నాడు.





సువర్ణయోగ చింతామణి

శ్రీకృష్ణదేవరాయలు ఆస్థానానికి ఒకసారి మాధురి అనే స్త్రీ వచ్చి ఇలా చెప్పింది.

"ప్రభూ, నేను కవిత్వ, సంగీత, నాట్యాలలో ఆరితేరిన దాన్ని. నా కళలను పరిశీలించి, పరీక్షించి తగినవిధంగా గౌరవించండి."

రాయలు వెంటనే మాధురికి పరీక్ష పెట్టాడు. మాధురి తన కవిత్వం వినిపించింది. వీణ వాయించింది. నాట్యమాడింది. ఆమె కళలకు ఎంతో సంతోషించిన రాయలు మాధురిని సన్మానించటమే కాకుండా ఆమెకు తగిన వసతిగృహం ఏర్పాటు చేసి, తన రాజ్యంలోనే ఉండిపోవలసిందిగా కోరాడు.

కొన్నాళ్ళకు రామలింగడు రాయలుని కలుసుకొని, "ప్రభూ, నాకెందుకో మాధురి ప్రవర్తన మీద అనుమానం కలుగుతున్నది. ఆమె నమ్మదగిన వ్యక్తి కాదు. సాధ్యమయినంత త్వరలో ఆమెను ఆస్థానం నుంచి పంపించి వేయటం మంచిది," అన్నాడు.

అది విని రాయలు చికాకుపడి, "రామలింగా, నీ కెప్పుడూ ఇలాంటి అనుమానాలే వస్తాయి," అన్నాడు.

అది విని రామలింగడు చిరునవ్వు నవ్వి, "నేనేది చెప్పినా మీరు నమ్మటం లేదు. సరే, మీకు ప్రత్యక్షంగా ఇది నిరూపించి నమ్మిస్తాను," అని వెళ్ళిపోయాడు.

ఇది ఇలా వుండగా, మాధురి ఇంటికి సమీపంలో ఒక స్వామీజీ ఆశ్రమాన్ని నిర్మించుకున్నాడు. ఆయన తనవద్దకు వచ్చిన వారందరికీ విభూతి, తీర్థమూ ఇస్తున్నాడు. స్వామీజీకి చాలా మహత్తు ఉందనే ప్రచారం బయలుదేరింది. ఒకనాడు మాధురి, ఆమె తల్లి స్వామీజీ దర్శనానికి వచ్చారు. స్వామీజీ వారిని ఆశీర్వదించి, తీర్థమిచ్చి, కొన్ని పుష్పాలను ఇచ్చాడు. అవి బంగారు పూలు!

స్వామీజీ, ఆశ్చరబోతున్న మాధురి తల్లి వైపు చూచి, "రోజూ నాకు భోజనం మీ

యింటి నుండి పంపించండి. మీ భక్తికి ఎంతో సంతోషించాను," అన్నాడు.

మాధురి తల్లి ఆ విధంగానే స్వామీజీకి భోజనం సిద్ధంచేసి తెచ్చింది. స్వామీజీ దాన్ని భుజించాక సంతోషపడి, ఆమెకు పది బంగారు పుష్పాలు యిచ్చాడు. నాటి నుండి ప్రతి దినమూ మాధురి యింటి నుండి ఆయనకు భోజనం రావటమూ, ఆయన భుజించిన తరవాత బంగారు పుష్పాలు యివ్వటమూ అలవాటు అయిపోయింది.

ఈ స్వామీజీ గొప్ప సిద్ధుడనీ, లేకుంటే ఇన్ని బంగారు పుష్పాలు ఎలా ఇవ్వగలుగుతాడనీ ఆలోచించింది మాధురి తల్లి. ఆ తరవాత ఒకనాడు స్వామీజీనే ఆ ప్రశ్న వేసింది ఆమె.

"ఓసీ, అమాయకురాలా! సిద్ధులకు సువర్ణ విద్య వంటి లోకాతీత విద్యలు ఎన్నో తెల్సి ఉంటాయని గ్రహించలేక పోయావు కదా! మాకు అనుగ్రహం కలిగినపుడు వాటిని భక్తులకు యివ్వటానికి కూడా అభ్యంతరం లేదు," అన్నాడు స్వామీజీ.

అది విని మాధురి తల్లి ఎంతో ఆశపడి, "అయితే, ఆ సువర్ణవిద్య మాకు ఉపదేశించండి. మేము మీ ప్రియ భక్తులం కదా!" అని పరిపరి విధాలుగా వేడుకొన్నది.

అప్పుడు స్వామీజీ నవ్వి, "మంచిది. నీ కుమార్తెను నా సేవలో కొద్ది రోజులు ఉంచు. నాకు ఆనందం కలిగినప్పుడు ఆమెకు ఈ విద్య తప్పకుండా ఉపదేశిస్తాను," అన్నాడు.

ఆమె ఎగిరి గంతేసి ఇంటికి పోయింది.

ఇది ఇలా వుండగా, స్వామీజీ నేరుగా రాయలవారిని దర్శించాడు. రాయలు స్వామీజీని ఎంతో గౌరవించాడు. అప్పుడు స్వామీజీ ఇలా చెప్పాడు.

"ఈ రాత్రికి మా ఆశ్రమంలో ఒక కవి సమ్మేళనం జరుగుతున్నది. అందులో ఒక మహా కవయిత్రి తాను రచించిన గ్రంథంలో నుంచి కొన్ని పద్యాలు వినిపిస్తున్నది. దానికి మీరు తప్పకుండా రావాలి. అయితే ఒక చిన్న నిబంధన వుంది. మీరు ఎవరినీ వెంట తీసుకు రాకుండా వంటరిగా మారువేషంలో రావాలి."

“తప్పకుండా వస్తాను, స్వామీజీ! ఇంతకూ ఆ కవయిత్రి ఏ కావ్యంలోనుంచి పద్యాలు వినిపిస్తున్నదో తెలుపగలరా?” అని ప్రశ్నించాడు రాయలు.

“ఆమె తాను రచించిన స్వర్ణయోగ చింతామణిలో నుంచి, వ్యాఘ్రాజిన శయ్యా సందర్భంలో యోగి భోగినీ సంవాద ఘట్టం నుండి కొన్ని రసవత్తరమైన పద్యాలు వినిపిస్తుంది. అది చాలా మంచి శృంగార ఘట్టం. మీరు ఆ ఘట్టాన్ని ఎంతగానో మెచ్చుకుంటారని మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. మీరు ఈ రాత్రికి మా ఆశ్రమానికి తప్పకుండా రావాలి,” అన్నాడు స్వామీజీ.

రాయలు అందుకు అంగీకరించాడు.

ఇది యిలా వుండగా, అనుకున్న సమయానికి మాధురి. స్వామీజీకి సేవ చేయటానికి వచ్చింది. స్వామీజీ అప్పుడు ఒక పెద్దపులి చర్మం మీద కూర్చొని ఉన్నాడు.

మాధురి వస్తూనే స్వామీజీ ఆమెను చూచి, “భక్తురాలా, నీ భక్తికి మెచ్చాను. నీకు బంగారం చేసే విద్య ఈ రోజు నేర్పుతాను. దానికి ముందుగా నీవు నన్ను బాగా సంతోషపెట్టాలి,” అన్నాడు.

“అలాగే స్వామీ,” అని చిరునవ్వుతో నమస్కరించి నిలిచింది మాధురి.

“అంతేకాదు, నీవు రాయలు ఆస్థానంలో నీ కళలు ప్రదర్శించటం నాకు యిష్టం కాదు.

అది మానితేనే నీకు సువర్ణవిద్యను నేను ఉపదేశిస్తాను,” అన్నాడు స్వామీజీ.

“మీరు నేర్పే సువర్ణవిద్య ఉండగా నాకు యింక ఈ రాయలు, గీయలు వ్యవహారమెందుకు స్వామీజీ? మీరు చెప్పినట్లు వింటాను. నిజానికి నాకు రాయలు మీద అభిమానం ఏమీ లేదు. కొన్నాళ్ళు ఇక్కడ ఉంటే రాయల సైనిక రహస్యాలు తెలుస్తాయి. ఆ తర్వాత బహిమినీ సుల్తానుల రాజ్యానికి నృత్యప్రదర్శనలకు వెళ్ళినప్పుడు, ఈ రహస్యాలు వాళ్ళకు చేరవేసి వారి మెప్పు పొందుతాను,” అన్నది మాధురి.

అందుకు స్వామీజీ పెద్దగా నవ్వి, మాధురిని తన పెద్దపులి చర్మం మీదికి

పిలిచాడు. ఆమె వచ్చి స్వామీజీని అనుకుని అయన ప్రక్కనే కూర్చున్నది.

అప్పటికే అక్కడికి వచ్చిన రాయలు అక్కడ జరుగుతున్నదంతా చూచాడు. దీనితో మాధురి నిజస్వరూపం బయట పడిపోయింది. సరిగ్గా అప్పుడే స్వామీజీ లోగడ తనతో ఒక కవయిత్రి స్వర్ణయోగ చింతామణి నుండి ఈ రాత్రి కవిత్వం వినిపిస్తుందని చెప్పినదంతా గుర్తు కొచ్చింది రాయలుకి.

స్వర్ణయోగ చింతామణి అంటే కవయిత్రి మాధురి సువర్ణవిద్య నేర్చుకోవాలని ఈయన దగ్గరికి రావటం అన్నమాట. వ్యాఘ్రాజిన శయ్యాఘట్టం అంటే ఆమె వచ్చి పెద్దపులి చర్మం మీద కూర్చునే సందర్భం అనీ, యోగి భోగినీ సంవాదమంటే స్వామీజీకీ, మాధురికీ మధ్య నడచిన సంభాషణలనీ రాయలు గ్రహించాడు. ఇక అక్కడ ఒక్క క్షణం కూడా నిలబడకుండా వెనుదిరిగి వెళ్ళబోయాడు.

"ఆఁ, ఆఁ! మీరు అలా చెప్పకుండా వెళ్ళిపోతే ఎలా? మహాప్రభువులు ఈ ఆశ్రమం లోపలికి వచ్చి, మా ఆతిథ్యం, ఆశీస్సులు స్వీకరించాలి," అంటూ స్వామీజీ ఆశ్రమం బయటకు వచ్చి, రాయలు చేతిని పట్టుకొని బాగా లోనికి తీసుకొని వచ్చాడు.

"మీరు నా కళ్ళు తెరిపించారు, స్వామీజీ! మీరు చేసిన మేలు ఈ జన్మలో మరిచిపోలేను. తమరు ఏ మఠంనుంచి ఇక్కడకు వచ్చారు? సెలవివ్వండి," అని రాయలు వినయంగా ప్రశ్నించాడు.

"ఇంకా తెలియలేదా? మేము తెనాలి ఆశ్రమం నుంచి వచ్చాము. మా పేరు రామలింగ యోగి," అంటూ రామలింగడు తన స్వామీజీ వేషం విప్పి వేశాడు.

రాయలు అది చూచి నివ్వెరపోయాడు. ఆనందపడ్డాడు కూడా. వెంటనే మాధురినీ, ఆమె తల్లినీ తన రాజ్యంనుండి వెడలగొట్టి, రామలింగణ్ణి ఎన్నో విధాల సత్కరించాడు.

1. మడగాస్కర్ దీవిలో ఏలక్కాయల పంట ఎక్కువ. అందువల్ల, ఆ దీవిని ఏలక్కాయల దీవి అంటారు.

2. దాదాపు రెండు వేల సంవత్సరాల క్రిందటే హాకీ ఈజిప్టు దేశంలో మొదలైంది.

3. నిజమే.

4. హిమాలయ పర్వతాలు కోటిన్నర సంవత్సరాల క్రిందట పుట్టాయంటారు. వీటిని ముడుత లేక లేత పర్వతాలు అంటారు.

ప్రశ్నలు

1. ప్రపంచంలో ఎక్కువగా ఏలక్కాయలు పండే చోటు ఏదో తెలుపగలవా?

2. హాకీ ఆట మొట్టమొదట ఆడిన దేశం పేరేమిటో చెప్పగలవా?

3. గబ్బిలాన్ని ఎంత దూరం తీసుకెళ్ళి వదిలి పెట్టినా, అది తాను నివసిస్తున్న చోటికి హాయిగా వచ్చేస్తుందంటారు. నిజమేనా?

4. హిమాలయ పర్వతాలు ఎప్పుడు పుట్టినవో తెలుసా?

41A

తల్లి ప్రేమ

ఒకప్పుడు సిరిపురంలో సోమయ్య అనే రైతు వుండేవాడు. అతడికి భీమయ్యా, బాలయ్యా అనే ఇద్దరు కొడుకులు. సోమయ్య ఇద్దరినీ చదువులకు పంపించాడు. కాని, భీమయ్యకు చదువు అబ్బలేదు. బాలయ్య అన్నిటిలోనూ ప్రథముడుగా వస్తూ ఉపాధ్యాయుల ప్రసంశలను అందుకున్నాడు. అందువల్ల సోమయ్య భీమయ్యను వ్యవసాయంలో ప్రవేశపెట్టాడు. భీమయ్య దానిలో రాణించాడు. భీమయ్య వ్యవసాయంలోనూ, బాలయ్య చదువులోనూ అభివృద్ధికి వస్తూవుండటం సోమయ్యకు ఎంతో తృప్తిని కలిగించింది.

అయితే, సోమయ్యకు తన భార్య సావిత్రి కొడుకుల నిద్దరినీ ఒకే రకంగా చూచుకోవటం లేదనిపించి, ఒకరోజు ఆమెను అడిగాడు. ఆమె అందుకు కారణ మున్నదని చెప్పి, ఆ నాటి రాత్రి కొడుకులు నిద్రపోతుండగా, వారి గుండెల మీద చిన్న చిన్న వెన్నముద్దలు వుంచి, తెల్లవారు ఝామున వాటిని పరిశీలించి చూడమని భర్తతో చెప్పింది. అలా చూడగా, బాలయ్య గుండెలమీది వెన్నముద్ద కరిగి వుండటం, భీమయ్య గుండె మీది వెన్నముద్ద అలానే వుండటం సోమయ్యకు ఆశ్చర్యం కలిగించింది. అది చూచి, సావిత్రి భర్తతో నవ్వుతూ ఇలా చెప్పింది.

"బాలయ్య చదివి చదివి మానసిక శ్రమ చేస్తూ వుండటంవల్ల, వాడి ఒళ్ళు వేడి ఎక్కిపోతున్నది. భీమయ్యది శరీరక శ్రమ. కాబట్టి ఒళ్ళు అలిసిపోయినా వేడి ఎక్కదు. అందువల్ల బాలయ్యను నేను ప్రత్యేక శ్రద్ధతో చూస్తూన్నానే తప్ప, మరో కారణం ఏమీ లేదు. వాళ్ళిద్దరికీ నేను కన్న తల్లినని మీరు మరిచి పోవద్దు."

—శ్రీసాయిశ్రీ



బొమ్మల సంభాషణ

ఈ ప్రక్కన ఇచ్చిన బొమ్మలోని వాళ్లు ఏం మాట్లాడుకుంటే నవ్వు వస్తుందో ఆ సంభాషణ వ్రాసి, ఈ సంచిక విడుదలైన పది రోజులలోగా పంపండి. బాగున్న నాలుగింటిని ఎన్నుకొని ఒకోదానికి రూ. 5 పంపుతాము.

బొమ్మరిల్లు

బొమ్మల సంభాషణ
మద్రాసు-26

45

పల్లెటూరివాడు

అవంతి, కాంభోజ దేశాలు ఇరుగు పొరుగున ఉన్నాయి. కాంభోజదేశం పాడిపంటలతో, సిరి సంపదలతో తులతూగుతూంటే అవంతిదేశం కరువు కాటకాలతో బాధపడుతూంది. ఇందుకు కారణం తెలుసుకుని రమ్మనమని అవంతి రాజు తన మంత్రిని కాంభోజదేశం పంపాడు. మంత్రి కాంభోజదేశమంతా తిరిగి కాంభోజ రాజధాని చేరుకున్నాడు. కాంభోజరాజు అవంతి మంత్రిని సాదరంగా ఆహ్వానించి, ఇష్టాగోష్టిలో తమ కాంభోజ దేశం ఎలా వున్నదో చెప్పమని అడిగాడు.

"మా దేశంలో పట్నవాసపు ప్రజలు ఎంతో నాగరికంగా ఉంటారు. కాని, మీ దేశంలో పట్నం వెళ్ళినా, గ్రామం చూచినా ప్రజలందరూ ఒకే విధంగా—పల్లెటూరి వాళ్ళలా, అనాగరికంగా, జంతుప్రాయులుగా కనపడ్డారు. ఇలా అంటున్నందుకు తమరు అన్యథా భావించకండి ప్రభూ!" అన్నాడు అవంతి మంత్రి.

తమ దేశపు వైభవాన్ని చూచి, అసూయపడి అవంతి మంత్రి అలాగంటున్నాడని కాంభోజరాజు గ్రహించి కూడా ఏమాత్రం ఆవేశపడకుండా, "మీరు చెప్పింది నిజమే కావచ్చు. కాని, ఒక్క విషయం నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. మా రాజ్యానికి పల్లె ఆదర్శం. పల్లె ప్రజల శ్రమను మేము గుర్తిస్తాము. వారి తెలివితేటలను గౌరవిస్తాము. వారి ఒరవడిలోనే అంతా నడుస్తాము. పల్లెటూరివాడు అంటే మా దేశంలో అది ఎంతో గౌరవమైన పదం. అనాగరికులకూ, జంతుప్రాయులకూ పర్యాయపదంగా ఆ పదం మీ దేశంలో వాడబడుతున్నదంటే నాకెంతో ఆశ్చర్యంగా ఉన్నది," అన్నాడు.

అతి త్వరలోనే, పల్లెటూరివాడు అనే పదాన్ని తిట్టుగా వాడే ఏ దేశమూ ముందుకు వెళ్ళదని అవంతి మంత్రి గ్రహించాడు. కాంభోజదేశపు వైభవానికీ, అవంతి దేశపు దుస్థితికీ కూడా మంత్రికి అసలు కారణం తెలిసి, తమ పద్ధతిని వెంటనే సవరించుకోవాలని అవంతి రాజుకు సలహా యిచ్చాడు.

—బాబి



బొమ్మల సంభాషణ

ఒకడు: ఒరేయ్, హాకీ కర్రతో ఆడబోయి కాలు జారి పడ్డా వేమిటిరా?

రెండోవాడు: నేను ఆడానంటే నీవు తప్పకుండా ఓడిపోతా వని... అంతే!

—యస్. పెదరాజు, చిన్నగుడిపల

తమ్ముడు: 'నా బంతిని తీసుకోవద్దు అన్నయ్యలూ,' అంటే విన్నారు కాదు.

అన్నదమ్ములు: (భయంతో) ఆఁ...

తమ్ముడు: ఇప్పుడు మీరు పట్టుకున్న హాకీ కర్రలు కూడా నిజమైనవి కావు. అవి కూడా దీపావళి రాకెట్లు, జాగ్రత్త!

—యస్. బాలచందర్, మహబూబ్‌నగర్

ఒకడు: చిచ్చుబుడ్డి కాల్చలేక చతికెల పడ్డాడు! బాంబు కాల్చటానికి బయలుదేరాడండీ, ఈ పెద్దమనిషి!

రెండోవాడు: ఓఁ, అది చిచ్చు బుడ్డేనా? బాంబు అనుకుని అనవసరంగా క్రింద పడిపోయానే...

—బి. యస్. ఈశ్వర్రావు, విశాఖ

క్రింద పడ్డవాడు: బంతిలో చిచ్చుబుడ్డి మందు కూర్చిం దెవర్రా?

నిలుచున్నవాడు: ఇంద్రజాలకుడి కొడుకును ఈ ఆటలో చేర్చుకో వద్దంటే విన్నావా? వాడు చూడు, మనలను చూచి ఎలా చేతులు ఎత్తి నవ్వుతున్నాడో!

—కె. చంద్రావతి, నర్సారావుపేట



నవంబరు



మంత్ర గ్రంథం

ఒకనాడు పిట్టలపాలెం జమీందారు పశువుల కాపరి గొర్రెల భీముడు, తప్పిపోయిన గొర్రె కోసం వెదుకుతూ, దాపుల నున్న కొండ గుహల కేసి వెళ్ళాడు. అక్కడ గుహల్లో భయంకరమైన విష సర్పాలూ, కొండ చిలువలూ, ఉడుములాంటి జంతువులూ వుండటం చాలామంది చూశారు. కాని, భీముడికి యిలాంటివంటే ఏం భయం లేదు.

"దెబ్బకు దయ్యం లోకువ, నా గండ్ర గొడ్డలికి 'విషజీవాలన్నీ లోకువ!" అంటూ వుంటాడు భీముడు.

భీముడు గండ్రగొడ్డలిని సాచి పట్టుకుని, గుహల్లోకి తొంగి చూస్తూ పోతూండగా, ఒక చోట వాడికి గొర్రె చిన్నగా అరిచిన శబ్దమైంది. వెంటనే భీముడు ఒక చిన్న రాయి తీసుకుని గట్టిగా అరుస్తూ దాన్ని గుహలోకి విసిరాడు. ఆ మరుక్షణం నక్కపిల్ల ఒకటి కయ్‌మంటూ గాభరాగా గుహ నుంచి బయటకి దూకింది.

భీముడు చప్పున కాలితో దాన్ని పైకి ఎగర తన్ని, అది కిందపడే లోపల దాని తోక పుచ్చుకుని, "నీ నక్క బతుక్కు, రాజా బెబ్బులి శూర్రాజుగారి గొర్రె కావలసి వచ్చిందా?" అంటూ నక్కపిల్లను నేల కేసి కొట్టబోయేంతలో, గొర్రె ఒకటి గొంతు దిగని ఏదో వస్తువుతో గిలగిల్లాడుతూ బయటకు వచ్చింది.

గొర్రెల భీముడు చప్పున నక్కపిల్లను కిందికి జార్చి, గొర్రెను పట్టుకుని, దాని నోట్లో వున్న లావుపాటి తాళపత్రాల కట్టను బయటికి లాగాడు.

ఆ తాళపత్రాలను చూచి భీముడికి కలిగిన ఆశ్చర్యం అంతా యింతా కాదు. అలాంటి వాటిని వాడు లోగడ ఆస్థాన వైద్యుడు గరుశా చారి చదువుతూండగా ఎన్నో సార్లు చూచి వున్నాడు.

"మనుషులు చదువుకునే వాటిని నువ్వ

తినాలనుకున్నావా? అందుకే అది నీ గొంతు పట్టుకున్నది," అంటూ భీముడు గొర్రెను గొడ్డలి కర్రతో గట్టిగా కొట్టి, తాళపత్రాల కట్టను అటూ ఇటూ తిప్పి చూస్తూ, మంద కేసి బయలుదేరాడు.

దారిలో ఒక చెట్టు నీడ పట్టున మంత్రాల చింతక్క, బంటు పిశాచి కాకితో మంతనాలాడుతూ, ఎదురుగా గుట్ట పోసుకున్న అడవి రేగుపళ్ళను బొక్కుతున్నది.

చింతక్క భీముడి చేతిలో వున్న తాళపత్రాల కట్టను చూస్తూనే, 'కీచు'మంటూ అరిచి, పక్కన వున్న మంత్రాల చీపురుకట్టను తీసుకోవటం కూడా మరిచి పోయి, భీముడి దగ్గరకు పరుగెత్తి, "ఒరే, భీముడూ! ఇది నీకు ఎక్కడ దొరికింది? ఇది ఆనాడేనాడో మా గురువు ఢాకినీ దొడ్డయ్యగారు పోగొట్టుకున్న మంత్రాల కట్ట అయి వుంటుంది. నా ఆయుస్సు సగం యిస్తాను. ఆ తాళపత్రాల కట్టను ఇటు ఇచ్చెయ్యి," అన్నది చేయి చాస్తూ.

గొర్రెల భీముడు 'చాచిన మంత్రాల చింతక్క చేయి నరకబోయిన వాడల్లా తమాయించుకుని, "నీ గురువు ఆ ఢాకినీ దొడ్డయ్య ఎక్కడున్నాడు? సగం యివ్వటానికి అసలు నీ ఆయువు ఎంత?" అన్నాడు కోపంగా.

చింతక్క ఏడ్పు ముఖం పెట్టి, "ఆ దొడ్డయ్య గురువు ఏనాడో ఢాకినీ లోకం చేరి పోయారు. ఈ పక్కనున్న నదిని పిల్ల కాలవగా నేను ఎరుగుదును. దాన్నిబట్టి

లెక్కేసుకో, నా ఆయువు అటూ ఇటూ ఎంత వుంటుందో!" అన్నది.

గొర్రెల భీముడు చేతి వేళ్ళను ముడిచీ, తెరచీ కొంతసేపు గొడవపడి, "అబ్బో, అంత కాలం బతికి, నేను చేసేదేముంది, రాజావారి గొర్రెల్ని కాయటమేగదా! ఈ జరిగి పోయిన కాపు చాలు. ఈ పండమాగిన తాటాకుల్ని గొర్రెలకు మేపుతాను," అంటూ ముందుకు కదిలాడు.

ఆ మరుక్షణం ఖరభశరభులు కిచ కిచ మంటూ పక్కన వున్న చెట్టు కొమ్మల్లోంచి కిందికి దూకి, "ఒరే, భీమా! చదువులేని మూర్ఖపు వెధవా! అవి ఎన్ని వేల సంవత్సరాల నాటి తాళపత్రాలో ఏమో! అందులో ఆకాశ గమనం, ఆగ్నేయాస్త్రాలు చేయటం, బొందితో కైలాసం చేరటం—అలాంటివన్నీ వ్రాసి వుండొచ్చు. పద, ఆస్థాన వైద్యుడు గరుడాచారికి చూపెడదాం," అన్నవి.

మంత్రాల చింతక్క కోపంతో చప్పిదవడల్ని ఆడిస్తూ, "ఒరే, చెట్టు కోతి వెధవల్లారా! మీరు మహాపండితుల్లా మాట్లాడబోతున్నారా? తిరిగి మిమ్మల్ని నేలబారు ఉడత వెధవల్ని చేయగలను, జాగ్రత్త! అది మంత్ర గ్రంథం, మా గురువుగారిది. అందులో చింతకాయల్ని కాల్చటం నుంచి, చుక్కల్ని నేల కూల్చటం వరకూ, మాంచి గడసరి మంత్రాలున్నవి, నాకు తెలుసు!" అన్నది.

అంతలో, వాళ్ళకు గుర్రం సకిలించిన శబ్దం వినబడింది. అందరూ అటుకేసి తలలు తిప్పి చూసేసరికి భుజాన తుపాకీతో ముసలి



పంచకళ్యాణిని ఎక్కి జమీందారు బెబ్బులి శూర్రాజూ, పక్కల నడుస్తూ అమాత్యుడు గుర్రాజూ, ఆస్థాన వైద్యుడు గరుడాచారీ కనిపించారు.

శూర్రాజు తుపాకీ ఎత్తి గుర్రాన్ని దౌడు తీయిస్తూ వాళ్ళ దగ్గరకు వచ్చి, "ఒరే, అరణ్యంలో వున్న చచ్చు వెధవలందరూ ఒక చోట పోగుపడ్డారేం? పూర్వం బుడతకీచూ వలందావాళ్ళలాగా, నా కోటను ముట్టడించేందుకు కుట్ర ఏమీ చేయటం లేదుగదా?" అన్నాడు కోపంగా.

గొర్రెల భీముడు నిలువెల్లా వణికిపోతూ, తాళపత్రాల కట్టను బెబ్బులి శూర్రాజు చేతిలో పెట్టాడు.

శూర్రాజు దాన్ని తిప్పి తిప్పి చూస్తున్నంతలో చింతక్క, "మహారాజా, అది మహ శక్తివంతమైన మంత్రాలున్న గ్రంథం. దాని సాయంతో మనం చేయరానిదంటూ ఏమీ లేదు," అన్నది.

శూర్రాజు ఆశ్చర్యపోతూ గుర్రం దిగి, సమీపిస్తున్న గరుడాచారికి తాళపత్రాలను చూపుతూ, "చింతక్క మాటలు విన్నావా? దీనిలో వున్న మంత్రాలతో సాధ్యం కానిదంటూ ఏమీ లేదట. భేష్! నా తిండి ఖర్చు కంటే ఈ జోడుగుళ్ళ తుపాకీ గుళ్ళ ఖర్చు జాస్తీగా వున్నది. ఆ మంత్రం ఏదో చూచి, చప్పున యిన్ని గుళ్ళు తయారయేలా చూడు," అని తాళపత్రాలను ఆస్థాన వైద్యుడు గరుడాచారి కిస్తూ, ఢాం అని గాలిలోకి తుపాకీ పేల్చాడు.

"మహారాజా, తమకు చాలాసార్లు మనవి చేశాను. అలా తుపాకీ గుళ్ళను గాలిలోకి పేల్చి, చాలా ధనం వృధా పరుస్తున్నారు," అన్నాడు గుర్రాజామాత్యుడు.

శూర్రాజు యీసారి ఢాం అంటూ చెట్ల కొమ్మల్లోకి తుపాకీ పేల్చి, "గుర్రాజామాత్యా, ఏం చేసేది? పేల్చదగిన శత్రువు ఒక్కడూ కంటబడడాయె! ఆ బుడతకీచు, వలందా, పరాసు శత్రువులు మా కోటను కూల్చి, పాడుచేసి, సముద్రాంతరాలకు పారిపోయిరి!" అన్నాడు.

అ మాటలు వింటూనే మంత్రాల చింతక్క ఎగిరి గంతేసి, "మహారాజా, దిగులు పడకండి! ఆ తాళపత్రాల్లో వున్న మంత్రాలు కంఠస్తం చేసి, తమరు అలా సముద్రజలం మీద గుర్రాన్ని దౌడు తీయిస్తూ పోయి, ఆ శత్రువుల నందర్నీ తమ నూరు గుళ్ళ శతఘ్నికి బలి చేయవచ్చు," అన్నది.

"అలాగా? ఏదీ నీ మంత్రాల చీపురుకట్టతో ఆ సముద్రాలన్నీ దాటు!" అంటూ ఖరభశరభులు చీపురుకట్టతో చింతక్క వీపు మీద గట్టిగా చరిచి, దూరంగా పోయి నిలబడినై.

గరుడాచారి కొంతసేపు తాళపత్రాలను పరీకించి చూచి అడ్డంగా తలాడిస్తూ, "మహారాజా, ఇందులో వున్న భాష, నేను ఎరిగిన భాషల్లో ఏ ఒక్కటీ కాదు. అసలు యిది మన జంబూద్వీపపు భాషే కాదని నా అనుమానం," అన్నాడు.

గుర్రాజామాత్యుడు తాళపత్రాలను తన చేతికి తీసుకుని, "ఏ దేశంవాడు యిక్కడి కొచ్చినా, వాడికి దిభాషులూ, త్రిభాషులుగా సేవ చేస్తూ తరించిన వాళ్ళం. నాకు చదవ రాదు కాని, ఈ తాళపత్రంలో వున్న భాష పరాసు వాళ్ళది," అన్నాడు.

గరుడాచారి ఉత్సాహ పడిపోతూ, "మహారాజా, వాళ్ళు మీకు కట్టవలసిన కప్పం తాలూకు హామీ పత్రమై వుంటుంది ఇది," అన్నాడు.

"అంతే అయి వుంటుంది. మరి ఆ డబ్బు వసూలు చెయ్యటం ఎట్లా?" అంటూ బెబ్బులి గుర్రాజు తుపాకీని గాలిలోకి గురి చేస్తున్నంతలో ఖరభశరభులు గుర్రాజు నుంచి తాళపత్రాలను గుంజుకుని, "ఈ వయసులో అనవసరంగా దూర ప్రయాణాలు పెట్టుకోకండి. మేం సప్త సముద్రాలూ గెంతుతూ దాటి, ఆ కప్పం వసూలు చేసుకు వస్తాం," అంటూ చెట్టుకొమ్మల్లోకి పరుగెత్తినై.

తండ్రి మాటను పాటించటం కోసం శ్రీరాముడు అరణ్య వాసానికి బయలుదేరాడు. శ్రీరాముడి వెంట సీత బయలుదేరింది. అన్నను సేవించుకొనే నిమిత్తం లక్ష్మణుడు కూడా వెంట వెళ్ళాడు.

శ్రీరాముడికి ప్రతి దినము ఉదయం పూట లక్ష్మణుడు స్నానం మొదలయిన ఏర్పాట్లు చేసేవాడు. అన్నకి కావలసిన పండ్లు కందమూలాలు సిద్ధం చేసేవాడు. పడుకోవటానికి అన్నకు శయ్య ఏర్పాటు చేసేవాడు. అన్నగారి ధనుర్బాణాలు, వస్తువులు తన భుజాన పెట్టుకొని మోసుకుపోతూ ఉండేవాడు. ఇలా కొంతకాలం గడిచింది.

శ్రీరాముడు అప్పుడు దండకారణ్యంలోకి ప్రవేశించాడు. దండకారణ్యం చాలా భయంకరంగా ఉంది. పులులు, సింహాలు, చిఱుత పులులు, కొండచిలువలు, ఎలుగుబంట్లు వంటి భయంకరమైన మృగములతో కూడుకొని ఉంది. ఎత్తైన చెట్లతో పట్టపగలే చిమ్మ చీకటితో కనబడుతున్నది. ఈ అడవిలో వారి ప్రయాణం చాలా కష్టంగా సాగుతున్నది.

"లక్ష్మణా, మనం ఇప్పుడు దండకారణ్యం ప్రవేశించాము. జాగ్రత్తగా ఉండు. ఏ దిక్కు నుంచి అయినా రాక్షసులు వస్తే రావచ్చు," అని హెచ్చరించాడు శ్రీరాముడు.

లక్ష్మణుడు కూడా చాలా జాగ్రత్తగా ముందుకు పోతున్నాడు. ప్రయాణపు బడలికతో లక్ష్మణుడు పూర్తిగా అలసిపోయాడు. దానికి తోడు ముగ్గురు మనుష్యుల సామానులు మొత్తం తాను ఒక్కడే మోస్తున్నాడు. తానింత కష్టపడుతున్నా శ్రీరాముడు, 'అయ్యో పాపం,' అని కూడా అనటం లేదే అని బాధ కలిగింది లక్ష్మణుడికి. దానితో, అన్న మీద బాగా కోపం వచ్చింది. తన భుజం మీద నుండి శ్రీరాముడి వస్త్రాలనూ, సామానులనూ క్రింద పడేశాడు. అలా వస్తువ

యం. వి. శ్రీలేఖ

లను విసిరేసి లక్ష్మణుడు చతికిలబడి నేల మీద కూర్చున్నాడు.

శ్రీరాముడు లక్ష్మణుడి వైపు వాత్సల్యంగా చూచి, "నాయనా, లక్ష్మణా! బాగా అలసి పోయినట్లున్నావే!" అని పలకరించాడు.

"చాలా బాగుంది. ఇదేనా పెద్దమనిషి లక్షణం? చచ్చి చెడీ నేను ఇన్నాళ్ళ నుండీ ఈ సామానంతా మోస్తుంటే, అణుమాత్ర మయినా జాలి కలుగలేదు. ఇప్పుడు 'నాయనా అలిసి పోయావా?' అంటూ ఓదా ర్చటం ఏం బాగుంది? ఈ లోకంలో ఎక్కడైనా న్యాయం, ధర్మం ఉన్నట్లు నాకు కనిపించలేదు. నేను నీ కంటే చిన్నవాడినే కావచ్చు. అంతమాత్రాన చాకిరీ మొత్తం నా నెత్తిన పడేయ వలసిందేనా?" అని గద్దించి అడిగాడు లక్ష్మణుడు.

శ్రీరాముడు, సీత లక్ష్మణుడి వైపు విచి త్రంగా చూచారు. ఆ తర్వాత శ్రీరాముడు చిరునవ్వు నవ్వాడు.

"లక్ష్మణా, దీనికి ఇంత కోపం ఎందుకు? నా సామాను నేను మోయనని ఎప్పుడైనా అన్నానా? ఇలా ఇవ్వు," అంటూ తన ధను ర్బాణాలు, కందమూలాలు తన చేతిలోనికి తీసుకున్నాడు శ్రీరాముడు.

"అన్నయ్యా, నీ సామాన్లు నీవు తీసు కున్నావు కదా! మరి నా సామాన్లు మాట ఏమిటి? ఇన్నాళ్ళుగా నీ వస్తువులు, వదినగారి వస్తువులు నేను మోస్తున్నప్పుడు, కొంతసేపు నాకు కూడా నీవు సహాయం చేయటంలో తప్పేమీ లేదు కదా!" అన్నాడు లక్ష్మణుడు.

"అలాగే, లక్ష్మణా! నీ వస్తువులు మాత్రం నేను మోయనని ఎప్పుడైనా అన్నానా? ఇలా యివ్వు," అంటూ శ్రీరాముడు కంద మూలాలు, లక్ష్మణుడి వస్త్రములు, ధను ర్బాణములు కూడా తన భుజాని కెత్తుకొని ముందుకు నడవసాగాడు.

ఇలా చాలా దూరం నడిచారు. ఆ భయం కరమైన అరణ్యాల నుంచి ముగ్గురూ బయట పడ్డారు. సూర్యుడు బాగా ప్రకాశిస్తూ ఉన్న మైదాన ప్రదేశం లోపలికి వచ్చారు. ఇంతలో ఉన్నట్లుండి లక్ష్మణుడు ఒక్కసారిగా పెద్దగా

గావుకేక పెట్టాడు. అది విని శ్రీరాముడు ఇలా అడిగాడు.

"ఏమయింది, లక్ష్మణా! ఏమయింది?"

"అపచారం, స్వామీ! అపచారం. మీరు సాక్షాత్తు భగవత్స్వరూపులు. నా వస్తువుల నన్నింటినీ భుజాన పెట్టుకొని మోస్తున్నారా? ఇంతకంటే నాకు మరే పాపం కావాలి? వెంటనే ఏ నూతిలోనో దూకి, ఈ పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటాను," అంటూ పెద్దగా విలపించసాగాడు లక్ష్మణుడు.

శ్రీరాముడు లక్ష్మణుణ్ణి ఓదార్చి, అతడి వస్తువులతోపాటు తన వస్తువులను కూడా లక్ష్మణుడి చేతికి ఇచ్చాడు. లక్ష్మణుడు భక్తితో అన్నపాదాలకు నమస్కరించి, ఆ పాదధూళిని తన తలపై వేసుకొని, వస్తువుల నన్నిటినీ భుజానికెత్తుకొని అతి వినమ్రంగా నడుచుకుంటూ సాగిపోతున్నాడు.

ఇది చూచి సీతాదేవి ఎంతో ఆశ్చర్యపడి, "స్వామీ, ఏమిటో లక్ష్మణుడు విచిత్రంగా మాట్లాడుతున్నాడు. అప్పుడు అలా వస్తువుల నన్నింటినీ విసిరి వేయటమేమిటి? ఇప్పుడు పశ్చాత్తాప పడుతూ మళ్ళా భుజానికెత్తుకోవట మేమిటి?" అని ప్రశ్నించింది.

"దేవీ, ఇందులో ఆశ్చర్య పడవలసింది ఏమీ లేదు. ఈ విషయంలో లక్ష్మణుడి తప్పు అణుమాత్రం కూడా లేదు. లక్ష్మణుడు తన భుజంపై వస్తువుల నన్నింటినీ నేల మీదికి విసిరేశాడే అది దండకారణ్యం. ఈ భూమిని అంతా రావణాసురుడు శూర్పణఖకు ఆడపిల్ల సొమ్ము క్రింద అరణంగా ఇచ్చిన ప్రాంతాలు. అక్కడ కోపతాపాలు ఎక్కువ. ఆ స్థల మహత్మ్యం అటువంటిది. అందుకే దేవుడి లాంటి లక్ష్మణుడికి కూడా నాపై కోపం వచ్చింది. ఇప్పుడు మనం దండకారణ్యం దాటి ఇవతల మైదానంలోకి వచ్చాం. దానితో లక్ష్మణుడు మళ్ళీ మామూలుగా మారాడు. ఇదే అలా విచిత్రంగా మాట్లాడటానికి కారణం," అన్నాడు శ్రీరాముడు.

కొక్కెరాధమా! నా మంత్రదండం దెబ్బ కాచుకో!" అంటూ కలియబడ్డాడు.

గంధర్వుడి గదా, యక్షుడి మంత్రదండం ఒకదాని నొకటి తాకినప్పుడు కలిగిన రాపిడికి చిటపట మంటూ నిప్పు రవ్వలు గాలిలోకి ఎగరసాగినై.

కొంచెం దూరంలో నిలబడి, అద్భుత పడిపోతూ యిదంతా చూస్తున్న రాజు చండసింహుడు మంత్రితో, "మహామంత్రీ, ఏమి అద్భుతం! మన కోట ప్రాంగణంలో ఏనాడైనా యీ విధంగా గంధర్వ యక్షుల మధ్య పోరు జరిగినట్లు విన్నామా?" అన్నాడు.

మంత్రి రాజు మాటలు వినే స్థితిలో లేడు.

మంత్రి యుద్ధం చేస్తున్న వాళ్ళ చుట్టూ గిరగిర తిరుగుతూ, "ఆహాఁ, ఆశ్చర్యం! ఇంత బలమైన దెబ్బలు తగులుతున్నా, ఎవరి శరీరాల నుంచీ ఒక్క చుక్క నెత్తురైనా క్రింద పడదేం?" అంటూ అరవసాగాడు.

అంతలో అక్కడికి వేటగాడు మల్లన్నా, బోయ భూతాలప్పా బలమైన తాళ్ళు భుజాలమీద వేసుకుని వచ్చారు. యక్షుడూ, గంధర్వుడూ తమ చుట్టూ ఏం జరుగుతున్నదో చూచే స్థితిలో లేరు. వాళ్ళు ఒకళ్ళనొకరు నిందించుకుంటూ పోరాడుతూనే వున్నారు.

శరభుడు సైగ చేయగానే భూతాలప్ప, "బోయమహా మాతా!" అని అరుస్తూ, యక్షుడి మీదికి తాడు విసిరాడు.

అదే క్షణంలోనే వేటగాడు మల్లన్న తాడును గిరగిర గాలిలో ఒకసారి తిప్పి, గురిగా ఒంటికంటి గంధర్వుడి మీదికి విసిరాడు.

భూతాలప్పా, మల్లన్నా తమపై విసిరిన తాళ్ళు తమ కంఠాలకి తగిలి ఉచ్చులు బిగుసుకోగానే యక్షుడూ, గంధర్వుడూ తమ, తమ ఆయుధాలను జార విడిచి, "యక్ష ప్రభో!" అని ఒకళ్ళూ, "గంధర్వ ప్రభో!" అని మరొకళ్ళూ అరుస్తూ, బోర్లా నేల మీద పడిపోయారు.

కంటి వాణ్ణి ఏదో అడగాలనుకుని, నోట మాట రాక బాధ పడసాగాడు.

శరభుడు, రాజుకు ధైర్యం చెబుతున్నట్టు ఒకసారి చేయి ఎత్తి, ఒంటికంటివాణ్ణి సమీపించి, "అయ్యా, తమరు ఎవరూ? ఏనాడూ చూచినట్టు లేదు," అన్నాడు.

ఆ ప్రశ్నకు ఒంటికంటివాడు, వెండిగదతో నేలను గట్టిగా కొట్టి, "నేను గంధర్వుణ్ణి. పేరు గోమాలుడు. మనిషివి అయిన నువ్వు, ఏనాడూ నన్ను చూడక పోవటంలో వింత ఏమీ లేదు," అన్నాడు వెటకారంగా.

"ఆ మాటా నిజమే! కాని, తమరు పని కట్టుకుని యింత దూరం ఎందుకు రావలసి వచ్చింది?" అన్నాడు శరభుడు.

గంధర్వ గోమాలుడు అందరికేసీ కోపంగా ఓ మారు చూచి, "మీ మనుషులు నేలను అంటి పెట్టుకుని తిరిగే అల్ప శక్తులు. మేం మహాశక్తి మంతులమైన గంధర్వులం. నీటి మీదా, భూమి మీదా, ఆకాశంలో యిష్టం వచ్చినట్లు తిరగగలవాళ్ళం," అన్నాడు.

ఆ మాట నిజమే కావచ్చు. కాని, యీ సమయంలో యిక్కడి కెందుకొచ్చారు అని అడుగుతున్నాను," అన్నాడు శరభుడు కత్తిపిడి మీద చేయి వేసి.

అదేమీ గమనించని గంధర్వుడు, యీసారి పళ్ళు కొరుకుతూ, కుంటియక్షుడికేసి చూచి, "పూర్వం ఒకప్పుడు రాక్షసుల ధాటికీ, భూకంపాల తాకిడికీ మా గంధర్వనగరం తట్టుకోలేక శిథిలమైపోయింది. ఆ శిథిలాలలో అంతులేని వెండీ, బంగారాలూ, రత్నమాణిక్యాలూ నిక్షిప్తమై పోయినై. వాటిని స్వాధీన పరుచుకునేందుకు ముందుగా ఆ నగర ముఖద్వారాలను తెరిచే వెండీ, బంగారపు తాళపు చెవులను, మాకు ఆ జన్మ విరోధులైన యక్షులు దొంగిలించారు. ఆ దొంగిలించిన యక్షరాజుకూ, మా గంధర్వ రాజుకూ ఆకాశంలో ఘోరయుద్ధం జరిగింది. ఆ సమయంలో ఆ

తాళపు చెవులు ఒకానొక మహారణ్యంలో పడి పోయినై. ఆ తర్వాత...” అని అంటూండగా శరభుడు అతడి మాటలకు అడ్డు తగిలి యిలా అన్నాడు.

“గోమాలగంధర్వా, యిక చాలు! సంగతి ఏమిటో తెలిసి పోయింది. ఆ దిక్కుమాలిన వెండీ, బంగారపు తాళపుచెవుల కోసం గంధర్వులైన మీరూ, యక్షులూ కొట్లాడు కుంటున్నారు. సరి సరి! మరి, మధ్యలో రాకుమారి మందారమాలను కనబడకుండా చేయుటంలో మీ పథకం ఏమిటి?”

“ఓరీ, మానవాధమా! దేవజాతికి చెందిన మా గంధర్వుల నగరద్వారాలను తెరిచే తాళపుచెవులు, దిక్కుమాలినవా? ఇంత అవమానకరంగా మాట్లాడినందుకు,

యిదే నీ ఓటి తలను వెయ్యి ముక్కలుగా చేయబోతున్నాను!" అంటూ గంధర్వుడు వెండి గదను ఎత్తి శరభుడి తల మీద కొట్ట బోయేంతలో కుంటియక్షుడు, "యక్షప్రభో!" అంటూ పెద్దగా కేక పెట్టి, తన బంగారు దండంతో, ఆ గంధర్వుడి గదను గట్టిగా ఢీ కొట్టాడు.

శరభుడు చప్పున పక్కకు తప్పుకున్నాడు.

ఒంటికంటి గంధర్వుడు కోపంతో నిలువెల్లా ఊగి పోతూ, "ఒరే, కుంటి యక్షాధమా, యిదే చచ్చితివి!" అంటూ యక్షుణ్ణి ఎదుర్కొన్నాడు.

కుంటియక్షుడు ఒంటికాలి మీద గెంతుతూ, "ఒరే, ఒంటికంటి గంధర్వ

"పీడా విరగడయింది! ఆస్థాన తలారినీ, ఆస్థాన పండితుణ్ణీ ముందు పిలవండి. ఈ యక్ష-గంధర్వ దుర్మార్గుల తలలు నరికేందుకు మంచి ముహూర్తం పెట్టించండి. మణిపురనగర పౌరులందరి సమక్షంలో వీళ్ళ తలలు నరికిద్దాం, మహామంత్రీ!" అన్నాడు రాజు.

అంతలో నేలమీద పడివున్న కుంటియక్షుణ్ణీ, ఒంటికంటి గంధర్వుణ్ణీ, బోయ భూతాలరాయుడూ, వేటగాడు మల్లన్నా మెడలు పట్టుకుని లేపి నిలబెట్టి, గొంతులకు బిగిసిన ఉచ్చుల్ని కొంచెం వదులు చేశారు.

"మహామంత్రీ, నా ఆజ్ఞ ఏమీ నువ్వు విన్నట్టు లేదే?" అంటూ రాజు కోపంగా మంత్రి కేసి చూశాడు.

"మహారాజా, మీ ఆజ్ఞ వినకపోలేదు. కాని, ఘన రాజ్య శాసన సూత్రాల ప్రకారం రాజ్య రక్షణకూ, సింహాసన రక్షణకూ అవసరం అయినప్పుడే దోషుల తలలు నరికెందుకు ముహూర్తాలు చూడటం జరుగుతూంది. ఈ దుర్మార్గుల పట్ల అలాంటి ధర్మ సూక్ష్మాలు పాటించనవసరం లేదు," అన్నాడు మంత్రి.

"అవును, అదీ నిజమే!" అంటూ రాజు చండసింహుడు తన భటులను పిలవబోయేంతలో శరభుడు ఆగమని హెచ్చరించి, "మహారాజా, తమ కుమార్తె ఏమైనదో తమరు గమనించినట్టే లేదు. మీరు యక్ష, గంధర్వులనుకునే వీళ్ళ సంగతి తరవాత చూద్దాం. ముందు యువరాణి సంగతి ఆలోచించండి," అన్నాడు.

—(ఇంకా ఉంది)





[జరిగిన కథ: రాజప్రసాదపు పునాదుల క్రింది నిధులను తవ్వుకునేందుకు జనం పలుగులూ, పారలూ తీసుకుని కోట ద్వారం దాటి రావటం తెలిసి రాజూ, మంత్రీ కంగారు పడతారు. శరభ, మల్లన్నల ప్రోద్బలంతో యక్షుడు మరోసారి గారడీ చేసి జనాన్ని తిప్పి పంపుతాడు. అంతలో, ఒంటికంటి గంధర్వ ద్రోకడు ప్రత్యక్షమై రాజకుమార్తె పేరేమిటో చెప్పమని రాజును బెదిరిస్తాడు. —ఇక చదవండి]

అప్పటికే తెలియని భయంతో గడ గడలాడి పోతున్న రాజు చండసింహుడు, బొంగురు పోయిన గొంతుతో, "మందారమాల," అన్నాడు.

"ఆమె ఇప్పుడెక్కడుంది?" అన్నాడు ఒంటికంటివాడు.

ఆ ప్రశ్న వింటూనే అందరూ ఉద్యానవనంలోని మందిరం కేసి చూశారు. అక్కడ బంగారు నెమిలి కాని, రాజకుమార్తె కాని కనిపించలేదు.

వెంటనే శరభుడు, "మల్లన్నమామా!" అంటూ పిలిచి, మల్లన్న దగ్గరకు రాగానే రహస్యంగా ఏమో చెప్పాడు.

అందరి దృష్టీ, యిప్పుడు కొత్తగా వచ్చిన ఒంటికంటి కిరీటం వాడి పైన వుండటంతో, శరభుణ్ణి ఎవరూ గమనించలేదు. వేటగాడు మల్లన అక్కడి నుంచి వెళ్ళి పోయాడు.

ఉద్యానవనంలోని మందిరం మీద తన కుమార్తె కనిపించక పోయే సరికి, రాజు చండసింహుడు విచారంతో నిలువునా కంపించిపోతూ, ఒంటి

బొమ్మరిల్లు

5 6A

శ్రవణుడి గొప్పతనం

వీరనాగుడికి తనంతటి బలశాలి లేడని మహా గర్వంగా ఉండేది. అతడు ఒకసారి రాజు కొలువుకి వెళ్ళి తన బలం గురించి ప్రగల్భాలు పలికాడు. అప్పుడు రాజాస్థానంలోని శ్రవణు డనే యువకుడు ముందుకు వచ్చి, బలంలో వీరనాగుణ్ణి మించినవాడు లేకపోవచ్చునీ అయితే, తాను అతణ్ణి ఓడించగలననీ చెప్పాడు.

శ్రవణుడు చూడ్డానికి ఎంతో నాజూకుగా ఉన్నాడు. అయితే అతడు శరీరశాస్త్రం బాగా చదివినవాడు. శ్రవణుడు తనకు తెలిసిన కిటుకులు ఉపయోగించి క్షణాలమీద వీరనాగుణ్ణి చిత్తు చేశాడు.

ఓడిపోయినా కూడా గర్వంగా, "ఆ కిటుకులు నాకు నేర్పు. అప్పుడు నేను నీకంటే గొప్పవాడినౌతాను," అన్నాడు వీరనాగుడు.

"మనిషి మనిషిని జయించటానికి బలమొక్కటే చాలదు," అన్నాడు శ్రవణుడు.

"బలం గొప్పతనం గురించి నీకేం తెలుసు? నేను ఒంటరిగా ఏ ఆయుధమూ లేకుండా అడవిలో తిరిగి రాగలను. ఎదురొచ్చిన జంతువును పట్టి చేతుల్తో చంపేయగలను. నువ్వలా చేయగలవా?" అన్నాడు వీరనాగుడు.

"చేతిలో ఏ ఆయుధమూ లేకుండా నేనూ అడవిలో తిరిగి రాగలను. జంతువుల్ని మాత్రం చంపను. మాటలు ఎందుకులే కాని, పద. ముందు మా యింటికి వెళ్ళి అక్కణ్ణించి అడవికి పోదాం," అన్నాడు శ్రవణుడు.

ఇద్దరూ కలిసి శ్రవణుడి ఇంటికి వెళ్ళారు. అక్కడ పెద్ద పులి అరుపులూ, సింహ గర్జనలూ వినిపించి భయపడ్డాడు వీరనాగుడు.

"కంగారు పడకు. ఆయుధం లేకుండా అప్పుడప్పుడు అడవిలో తిరిగినప్పుడు మచ్చిక చేసి తీసుకొని వచ్చిన జంతువులవి," అన్నాడు శ్రవణుడు.

తానెప్పటికీ శ్రవణుడంతటివాడు కాలేడని గ్రహించాడు వీరనాగుడు. తను జంతువులతో సమానంగా పోరాడగలడు. కాని, శ్రవణుడు వాటికి యజమాని అయి మచ్చిక చేస్తాడు.

—రాజా





ప్రజాసేవకుడు

వీరగుప్తుడు, శూరసేనుడు దాయాదుల బిడ్డలు. సహజంగా వారిమధ్య జ్ఞాతి వైరముంది. నలుగురిలో మామూలుగా స్నేహం నటించినా వారిద్దరూ కూడా ఒకరి వెనుక ఒకరు గోతులు తవ్వుకుంటూ వుండేవారు.

ఇలా ఉండగా, రాజు చిత్రసింహుడికి పరిపాలనా భారం ఎక్కువై ప్రజల అవసరాలను ప్రత్యేకంగా గమనించి, వారికి అవసరమైన సేవ చేయటం కోసం ఒక అధికారిని నియమించాలని అనుకున్నాడు. అధికారి అని పేరు పెడితే అధికారం చెలాయించటం మాత్రమే చేస్తాడని భయపడి, రాజు ఆ అధికారికి 'ప్రజాసేవకుడు' అని పేరుపెట్టాడు. ఆ పదవి వీరగుప్తుడికి లభించింది.

అసలు ప్రజాసేవకుడి పదవి అవసరం లేదనీ, వీరగుప్తుడిపై అభిమానంతో రాజు ఆ పదవిని సృష్టించి అతడి కిచ్చాడనీ చాలా మంది చెప్పుకున్నారు. దానికి తగ్గట్టే వీరగుప్తుడు ప్రజల మధ్యకు అట్టే వెళ్ళే వాడు కాదు, వాళ్ళ కష్టసుఖాలు అట్టే విచారించే వాడు కాదు. అతడు తన కాలాన్ని ఎక్కువగా రాజు సమీక్షంలోనే గడిపేవాడు. తన సేవల్ని ఎక్కువగా రాజుకే అంకితం చేసేవాడు.

వీరగుప్తుడికి ఆ పదవి లభించినందుకు శూరసేనుడికి కడుపు మంటగా ఉంది. అందుకని అతడు శూరగుప్తుడి పద్ధతిని విమర్శించేవాడు. ప్రజలంతా వీరగుప్తుడిమీద ఆశలు పెట్టుకున్నారు. అవన్నీ ఎడారిలో ఎండమావులయిపోతున్నాయని శూరసేనుడు చాలా మంది వద్ద చెప్పి బాధపడేవాడు.

వీరగుప్తుడిపై రాజుకు ఎన్నో ఫిర్యాదులు రావటంతో, ఒక పర్యాయం శూరసేనుడి సమక్షంలో రాజు వీరగుప్తుణ్ణి నిలదీసి, "నీ వల్ల ప్రజాసేవ ఏమీ జరుగుతున్నట్టు లేదు. దీనికి నీ సంజాయిషీ ఏమిటి?" అని అడిగాడు.

దానికి వీరగుప్తుడు వినయంగా నమస్క

రించి, "ప్రభూ, సముద్రంలో ఎంత నీరు పోసినా, సముద్రంనుంచి ఎంత నీటిని తీసినా తేడా తెలియదు. మహాసముద్రంలాంటి మన ప్రజలకు, నేను చేసే సేవ కూడా అలాగే కనపడకుండా పోతున్నది," అన్నాడు.

అప్పుడు శూరసేనుడు, "ప్రభూ, ప్రజా సేవకుడు ప్రజాసేవ చేయాలి. కాని, వీర గుప్తుడు స్వార్థంతో రాజుగారినే సేవిస్తున్నాడని అందరూ చెప్పుకుంటున్నారు," అన్నాడు.

అది వింటూనే వీరగుప్తుడు రాజు వైపు తిరిగి, "యదార్థంగా భూప్రదక్షిణం చేసిన కుమారస్వామి కంటె, తల్లిదండ్రుల చుట్టూ తిరిగి ఊరుకున్న వినాయకుడు త్వరగా భూప్రదక్షిణం చేసిన ఫలితం పొందాడు. అందుకు కారణం అతడి తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులు ఈ ప్రపంచానికి పాలకులు కావటమే కదా! అందువల్ల ప్రభూ, ప్రజలందరిని ఎంతో ప్రేమగా చూచుకునే మిమ్మల్ని సేవించటంవల్ల ప్రజాసేవ జరుగ లేదనుకునే వారు మూర్ఖులు. మీ సాంగత్యంలో నేర్చుకున్న దానితోనే నేను ప్రజా సేవ చేస్తున్నాను," అన్నాడు.

ఈ సమాధానానికి రాజు ఎంతగానో సంతోషించాడు. శూరసేనుడు ఇక ఏమీ మాట్లాడలేకపోయాడు. అయితే, అతడు తన ప్రయత్నాలు తాను చేస్తూనే ఉన్నాడు. చాటుమాటుగా ఎందరో ప్రజా ప్రముఖుల్ని అతడు రెచ్చగొట్టాడు. ఫలితంగా రాజుకు వీరగుప్తుడిపై ఫిర్యాదులు నానాటికీ పెరిగిపోవటంతో మంత్రి రాజుకు యిలా సలహా యిచ్చాడు.



గుప్తుడి భవనానికి వెళ్ళాడు శూరసేనుడు. కాని, శూరసేనుడు భావించినట్లు వీర గుప్తుడు దిగులుగా లేడు. శూరసేనుడు వెళ్ళే సరికి, అతడి ఇంట పెద్ద విందు జరుగు తున్నది. తనకు ఇష్టులైన వారందరికీ వీర గుప్తుడు ఆ విందు ఏర్పాటు చేశాడు. శూర సేనుణ్ణి చూస్తూనే అతణ్ణీ, అతడి భార్యనూ సాదరంగా ఆహ్వానించాడు వీరగుప్తుడు.

"ఏమిటీ హడావుడి అంతా!" అని ఆశ్చర్యంగా అడిగాడు శూరసేనుడు.

"ఏముందీ? పదవి బాధ వదిలి పోయింది కదా! అందుకని ఇష్టులందరితోటీ వేడుక చేసుకుంటున్నాను," అన్నాడు వీరగుప్తుడు.

ఇద్దరూ కాస్త చాటుగా వెళ్ళారు. అప్పుడు శూరసేనుడు వీరగుప్తుడితో ఇలా అన్నాడు.

"పదవి పోతే నువ్వు బాధ పడతావను కున్నాను. కాని, నీ ముఖం చూస్తూంటే ప్రపంచంలోని సంతోషమంతా నీ వద్దనే ఉన్న దనిపిస్తూంది. నిన్ను ఎప్పుడూ ఇంత సంతో షంగా చూడలేదు."

"తమ్ముడూ, అధికారంలేని పదవిలో సుఖం లేదు. నేను ప్రజల కష్టసుఖాలు విచారించి వాళ్ళకు ఏం చేస్తే బాగుంటుందో చెప్పాలి. అప్పుడు రాజు నేను చెప్పింది చేయాలి. కాని, నేను చెప్పినట్లు చేస్తే నాకు పేరు వస్తుందని రాజుకు భయం. నేను ప్రజలమధ్యకు వెళ్ళి రాజుకు చెప్పవలసినవన్నీ చెప్పటమూ, అయ

"ప్రభూ, ఈ ప్రజాసేవకుడి పదవిని ఎప్పుడూ ఒక్కడికే యివ్వటం కంటె ఏటేటా మార్చుతూంటే బాగుంటుందని అనిపిస్తూంది నాకు. వీరగుప్తుడి స్థానంలో మరొకరిని నియ మించండి!"

రాజుకు వీరగుప్తుడు ఇష్టుడు. అందువల్ల రాజు వీరగుప్తుణ్ణి తన ఆంతరంగికుడుగా చేసు కుని, కొత్త ప్రజాసేవకుడిగా శూరసేనుణ్ణి నియమించాడు. ఈ విషయం తెలియగానే శూరసేనుడికి కలిగిన ఆనందం అంతా ఇంతా కాదు. తనకు ఏదో గొప్ప సన్మానం జరిగిందనీ, వీరగుప్తుడికి పెద్ద అవమానం జరిగిందనీ అతడు భావించాడు. తన దర్పాన్ని ప్రదర్శించటం కోసం భార్యాసమేతంగా వీర

నేమో ఆయనకు తోచింది చెయ్యటమూ జరుగుతూ వచ్చింది. దానితో ప్రజలకు నాపై అసంతృప్తి బయలుదేరింది. అందరూ నాపై ఫిర్యాదులు చేయటం మొదలు పెట్టారు. అప్పుడు నేను చేసేదిలేక పూర్తిగా రాజునే ఆశ్రయించాను. తనను నమ్మిన వాళ్ళకు రాజుగారు ఎన్నడూ అన్యాయం చేయడు. కనుక, నాపై ఈగ కూడా వాల లేదు," అన్నాడు వీరగుప్తుడు.

"మరి అలాంటప్పుడు పదవిలో ఉంటే ఆనందమేగా?" అన్నాడు శూరసేనుడు.

"నీ చుట్టూ ఉన్నవాళ్ళు అందరూ నువ్వు ఏదో చేస్తావని ఆశిస్తున్నారు. కాని, నువ్వు ఏమీ చెయ్యలేవు. ఆ సంగతికి బయటికి చెప్పుకోలేవు. రాజు ఒప్పుకోవటం లేదన్నావంటే నీ ప్రాణాలే పోతాయి. అందువల్ల చెయ్యని నేరానికి శిక్ష అనుభవిస్తూ కాలం గడపాలి. ఈ పరిస్థితిలో పదవి పోగానే ప్రాణం హాయిగా ఉంది," అన్నాడు వీరగుప్తుడు.

"ఆ పదవి ఇప్పుడు నాకు లభించిందని తెలుసుగా?" అన్నాడు శూరసేనుడు.

"అవును తమ్ముడూ! నేను ఎన్నో సాధించాలనుకుని సాధించలేక పోయాను. అవి నువ్వు సాధించాలని ఆశిస్తున్నాను. అన్నింటిలోకీ ముఖ్యమైనది ప్రజాసేవకుడికి తన నిర్ణయాలు అమలు పరిచే అధికారం ఉండాలి. నువ్వు అది సాధించు," అన్నాడు వీరగుప్తుడు.

ఈ విషయమంతా విన్న శూరసేనుడి భార్య, "మీ అన్నగారు చెప్పిన దాన్నిబట్టి మీరేమనుకుంటున్నారు? ఆయన సాధించలేక పోయినవన్నీ మీ హయాంలో సాధించి చక్కగా ప్రజాసేవ చేసి మంచి పేరు తెచ్చుకోవాలనుకుంటున్నారా?" అని అడిగింది.

శూరసేనుడు నవ్వి, "అదేమీ కాదు. ఒక ఏడాదిపాటు అన్నయ్యలాగే ప్రజాసేవ చేసి, ఆ తర్వాత వచ్చే కొత్త ప్రజాసేవకుడికి అన్నయ్య చెప్పిన మాటలే చెబుదామనుకుంటున్నాను," అన్నాడు.



లోగుట్టు

ఒక ఊరిలో పశువుల సంత జరుగుతూంది. సుధాముడనే వ్యక్తి తన ఆవును అమ్మాలని సంతలో ఒక చోట కూర్చుని వున్నాడు.

ఆవును కొనాలని ఎవరైనా వచ్చి దాని ధర అడిగితే, ధర చెప్పి, "మీది ఏ వూరు?" అని అడిగి తెలుసుకొని, "ఆ వూరి వాళ్ళకు అయితే నేను ఆవును అమ్మ బోయేది లేదు," అని చెప్పసాగాడు సుధాముడు.

సుధాముడు ఇలా ఎందుకు చెపుతున్నాడో, ఆ చుట్టుపక్కల వున్నవాళ్ళకు ఎంత ఆలోచించినా అర్థం కావటం లేదు. ఈ విధంగా సాయంత్రం దాకా జరిగింది. అప్పుడు గోపాలపురం నుంచి రాజయ్య అనే వ్యక్తి వచ్చి ఆవు ధర అడిగాడు.

రాజయ్య వూరు గోపాలపురం అని తెలియగానే, సుధాముడు ఎగిరి గంతేశాడు. మిగతా వాళ్ళకు చెప్పిన ధరకన్నా తక్కువ ధరకు ఆవును రాజయ్యకు అమ్మేశాడు సుధాముడు. ఇది చుట్టుప్రక్కల వున్న వాళ్ళకు ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది.

రాజయ్య ఆవును తీసుకొని పోయాక, ఇలాంటి బేరాలను ఎన్నో సుధాముడి దగ్గరికి తీసుకొని వచ్చిన దళారి సుబ్బయ్య, అలా తక్కువ ధరకు ఆవును రాజయ్యకు అమ్మటంలో గల ఆంతర్యం ఏమిటో చెప్పమని సుధాముణ్ణి అడిగాడు.

అందుకు సుధాముడు నవ్వి, "ఈ ఆవుకు ఒక ప్రత్యేకత వుంది. ఇది ఎంత లావుపాటి తాడును కట్టినా, తెల్లవారేటప్పటికి ఆ కట్టుతాడును తెంచుకుని, మా యింటికి వచ్చి మందలో చేరిపోతుంది. గోపాలపురం మా వూరికి చాలా దగ్గర. నువ్వు తెచ్చిన మిగతా బేరగాళ్ళందరి వూళ్ళూ మా వూరికి ఎంతో దూరం. అదీ కాక, ఆ వూళ్ళకూ మా వూరికీ మధ్య ఏరు అడ్డంగా పారుతుంది. ఈ ఆవుకు ఏరు దాటటం చేతకాదు. మరి నేను అమ్మింది లాభసాటి బేరానికే కదా!" అన్నాడు.

అది విని, దళారి సుబ్బయ్య తెల్లబోయాడు.

—ఎమ్. డి. సౌజన్య

62

నవంబరు బొమ్మరిల్లు పరీక్షాపత్రం జవాబులు

ఊళ్ళ పేర్లు: మీరు వ్రాసినవే; వింత అంకెలు: నిలువుగా, అడ్డంగా అయి మూలలుగా ఎటు నుంచి కూడినా 15 వస్తుంది. 1 నుంచీ 9 దాకా వుండే వరుస అంకెలు చదరంలో వున్నాయి; ఏమిటిది?: తేడేలు; రెండు పదాలు: ఆలి (అహారం + తోటమాలి), అక్క (అల్లా' వుద్దీన్ + కుక్క); జంట ముక్కలు: AJ, BM, CG, DH, EL.FK; చేసే పని ఏమిటి?: ఇంద్రజాలము; మార్చి చూపండి: మీరు వ్రాసినవే; ఏమేమి దాగి వున్నాయి?: బాతు, కుందే పిల్లి (చెట్టులో), ఒకటి, త్రిభుజము గుణకారపు గుర్తు, దువ్వెన (మనిషిలో); బొమ్మ గీయండి: మీరు గీచినదే; కథల పేర్లేమిటి?: 1. వానరరాజు వాలి, 2. మర్యాదస్థుడు; కారణమేమిటి?: సంవత్సరానికి 365 1/4 రోజులుగా లెక్క కట్టాలి. ఆచరణలో ఇది కష్టం. కాబట్టి, 365 రోజులుగా లెక్కించి, ప్రతి నాలుగో సంవత్సరంలో అదనంగా ఫిబ్రవరి నెలకి ఒక రోజు కలిపి, 29 రోజులుగా లెక్కిస్తున్నారు; పూరించండి: 4; ఆకృతి ఏమిటి: వృత్తాకారము.

దారి గీచి పంపండి

మీరేమి చేశారంటే...

నవంబరు 'బొమ్మరిల్లు' పరీక్షాపత్రంలో జవాబులు వ్రాసి బహుమతి పొందిన మొదటి మూడు స్థానాలవారు ఒకే మార్కులు పొందారు.

'ఏమేమి దాగి వున్నాయి?' అన్న ప్రశ్నలో దాగివున్న వాటిని వ్రాయటం మాత్రమే చేయాలి. అంటే ఒకసారి చూస్తే గుర్తించలేనివీ, కంటికి కనిపించనివీ అన్న మాట. ఇది చాలా మంది గుర్తుంచుకున్నట్లు లేదు.

చాలా మంది తప్పుగా వ్రాసిన ప్రశ్న—'రెండు పదాలు' అనేది. 'ఇది పరుగెత్తుతుంది. దేన్ని చూచి?' అన్నది బుల్లి ప్రశ్న. అక్కడ ఓ పరుగెత్తే ఎలుకను చూపి, దానికి కళ్ళజోడు పెట్టాం. అంటే ఎలుక జాగ్రత్తగా దేన్నో వెతుకుతూందన్నమాట. అది కనిపించగానే పరుగెత్తుతూన్నది. అది ఆహారం. చాలా మంది పిల్లి (మార్జాలం)ని చూచి పరిగెత్తుతూందన్న ధోరణిలో జవాబులు వ్రాశారు. ప్రశ్నలో 'భయపడి' అన్న మాట వుంటే తప్ప 'పిల్లి (మార్జాలం)' అన్న జవాబు తప్పు క్రిందే జమకట్టుకోవాలి. మేము అలానే చేశాం.

విజేతలు

[బ్రాకెట్లలో యిచ్చినవి వారి మార్కులు]

మొదటి ముగ్గురు: 1. జి. సుబ్రహ్మణ్యం, కావలి (97) 2. వి. జగన్నాథరావు, హైద్రాబాద్ (97) 3 బి. విశాలక్షి, గుంటూరు (97) ఒక్కొక్కరికి రూ. 50 పంపబడుతాయి.

4వ స్థానం నుంచి 10వ స్థానం పొందినవారు: 4. బి. వి. నారాయణ, గూడూరు (96) 5. జె. రామమూర్తి, నిజామాబాద్ (96) 6. ఆర్. యస్ మీరాబాయ్, నెల్లూరు (96) 7. యస్. మల్లికార్జునరావు, కాకినాడ (96) 8. పి. వెంకటసుబ్బయ్య, ధర్మవరం (95) 9. ఎం. కె. రావు, బరంపురం (95) 10. జి. సులోచనాదేవి, టంగుటూరు (95) ఒక్కొక్కరికి రూ. 20 పంపబడుతాయి.

11వ స్థానం నుంచి 20వ స్థానం పొందినవారు: 11. ఎం. ప్రకాశరావు, సింగరాయకొండ (94) 12. ఎ. గోవర్ధనరావు, బుచ్చిరెడ్డిపాలెం (94) 13. పి. శకుంతల, తిరుపతి (94) 14. జె. రాఘవరావు, కడప (94) 15. వి. శశిరేఖ, అద్దంకి (94) 16. వి. వి. ప్రభాకర్, నర్సరావుపేట, (94) 17. కె. రామమూర్తి, కావలి (94) 18. వి. మురళీమోహన్, తిరుపతి (93) 19. జి. పార్వతి, గుంతకల్ (93) 20. డి. నాగేశ్వరరావు, రేణిగుంట (93) ఒక్కొక్కరికి రూ. 5 పంపబడుతాయి.

1

సమయానికి ఫోటో రాలేదు కాబట్టి, ఫోటో ప్రచురించలేక పోతున్నాం.

2

సమయానికి ఫోటో రాలేదు కాబట్టి, ఫోటో ప్రచురించలేక పోతున్నాం.

3

సమయానికి ఫోటో రాలేదు కాబట్టి, ఫోటో ప్రచురించలేక పోతున్నాం.

మొదటి ముగ్గురు:

Edited and published by Vijaya Bapineedu, 80, Dhanalaxmi Colony, Madras-26, Phone : 422233 and Printed by N. Navin Chandran at S. R. Offset Art Printers, Madras-21. Phone : 552462.

63

నా పళ్ళపొడిలో బ్రహ్మాండమైన పెప్పర్‌మెంట్ నూనె వుంది!
ఆ దేం గొప్ప? ఎంచక్కా నా పళ్ళపొడిలోనేమో..... లవంగ నూనె వుంది తెలుసా?
పిల్లలూ!...... పెప్పర్‌మెంట్ ఆయిల్ లవంగనూనె. ఈ రెండూ కలిసిన మరో అద్భుతమైన ప్రత్యేక పళ్ళపొడి ఒకటి వుందన్న విషయం మీకు తెలుసా?.. అదే!...... జెమిని పళ్ళపొడి!
GEMINI TOOTH POWDER
Gemini TOOTH POWDER for strong gums healthy teeth
GEMINI TOOTH POWDER
GEMINI TOOTH POWDER
జెమిని
పళ్ళపొడి
అవును అది అక్షరాలా నిజం!......
అతిశ్రేష్ఠమయిన లవంగనూనె. పెప్పర్‌మెంట్ ఆయిల్. ఈ రెండూ కలిసిన పళ్ళపొడి ఇంతవరకూ ఈ దేశంలో తయారు చేయబడలేదు. కానీ యిప్పుడు. అతికొద్ది కాలంలోనే మీ అభిమానాన్ని ఎంతగానో సంపాదించుకున్న "జెమినీ" పళ్ళపొడిలో ఈ రెండు అద్భుతాలూ కలిసి వున్నాయి. ఇలాంటి అద్భుతమైన పళ్ళపొడికి సాటి మరొకటి లేదు. అంతేగాకుండా ఇందులోగల "మైక్రో గ్రైండింగ్" మూలంగా మీ పళ్ళు తక్షణం తళ తళ లాడుతాయి. మరో విశేషం ఏమిటంటే ప్రయాణాలలో ఎంత-గానో ఉపకరించే "లీక్‌ప్రూఫ్" సిల్వర్ ఫాయిల్ పౌచ్‌లలో లభిస్తున్న దేశంలోని ఏకైక పళ్ళపొడి కూడా!
తయారు చేయువారు:- జెమిని కెమికల్ ప్రొడక్ట్స్ - మచిలీపట్నం- 521001 (A.P)
MRN PRASAD RAO
USHASREE ADS MS.17

64

everest/81/PP/101-t

Check List

Book Number	PAKOLIA'269	Date	29/7/2022
Front Cover	NO	Back Cover	YES
Blank Pages	65		
Missing Pages	NO		
Prepared By	Sruthi	Cutting By	Sruthi
Scanned By	Sruthi	Pages	75